12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టి. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 13 సంచిక : 54 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 28 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :13 ISSUE :54 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 28 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Visakhapatnam,Kakinada,Bapatla,NarasaraoPeta,Ongole,YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

"ఈ రెండేళ్లు ఓపిక పట్టండి.. వచ్చేది జగన్ 2.0" అని పార్టీ శ్రేణులకు వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన... అధికార కూటమిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పులివెందుల నుంచి మొదలయ్యే ధ్వని రాష్ట్రమంతా వినిపించాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని తుడిచిపెట్టేస్తామని ధీమా వ్యక్తం చేశారు.





# తిరగబడండి.. మీ అన్న మీకు తోడుగా ఉంటాడు

## పులివెందల నుంచి ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలి

### వైయస్ జగన్ పిలుపు

- ఈ రెండేళ్లు ఓపిక పడితే వచ్చేది జగన్ 2.0 అన్న జగన్
- అన్యాయం చేసిన అధికారులను వడ్డీతో సహా చెల్లించేలా చేస్తామని హెచ్చరిక
- పులివెందులలో కార్యకర్తలపై చేయి వేస్తే తనపై వేసినట్లేనని స్పష్టీకరణ

"మా టైమ్ వచ్చినప్పుడు, చట్టాన్ని అతిక్రమించి అన్యాయం చేసిన ఏ అధికారినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారు సర్వీసులో ఉన్నా, ఒకవేళ రిటైర్ అయిపోయినా సరే.. ఎక్కడున్నా తీసుకొచ్చి చట్టం ముందు నిలబెట్టి చర్యలు తీసుకుంటాం. వడ్డీతో సహా చెల్లించేలా చేస్తాం" అని తీవ్రంగా హెచ్చరించారు. పులివెందులలో తమ కార్యకర్తలపై చేయి వేస్తే, తనపై చేయి వేసినట్లేనని ఆయన స్పష్టం చేశారు. "మన హక్కులు మనమే కాపాడుకోవాలి. తిరగబడండి" అని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో అధికార కూటమి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోందని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. "ఎన్నికల్లో 50 శాతం సీట్లలో పోటీ చేస్తున్నది మా అక్కచెల్లెమ్మలే. వారి నామినేషన్లను నడిరోడ్డుపై అడ్డుకుంటున్నారు. అక్కచెల్లెమ్మల చీరలు చించి దాడులు చేశారు. ఇలా చేయడానికి మీకు సిగ్గుందా? వైసీపీ హయాంలోనే మహిళలకు నిజమైన న్యాయం జరిగింది. ఇప్పుడు చంద్రబాబు చేస్తున్న పనులకు ఆయనే సిగ్గుతో తలదించుకోవాలి" అని మండిపడ్డారు. నామినేషన్ల ప్రక్రియలో అడుగడుగునా అక్రమాలు జరిగాయని జగన్ ఆరోపించారు. "కూటమి నేతలే 17 మున్సిపాలిటీలు ఏకగ్రీవమని ప్రకటించుకున్నారు. నా సొంత నియోజకవర్గమైన పులివెందులలోనే కేవలం 20 వార్డుల్లో నామినేషన్లు వేయగలిగాం. 7 జడ్పీటీసీ స్థానాలకు గాను 4 చోట్ల మాత్రమే పోటీ జరుగుతోంది. స్క్రూటినీ పేరిట 2 మండలాల్లో మా నామినేషన్లను అన్యాయంగా తిరస్కరించారు" అని దుయ్యబట్టారు. కార్యకర్తలంతా ధైర్యంగా ఉండాలని, వారికి తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ రోజున తాను స్వయంగా పులివెందులలోనే ఉంటానని ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలుపు ఖాయమని అన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని... మీ అన్న మీకు తోడుగా ఉంటాడని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు.



# కడప కార్పొరేషన్ నేతలతో వైయస్ జగన్ భేటీ

- కార్పొరేషన్ ఎన్నికలపై పార్టీ నేతలకు దిశానిర్దేశం
- నామినేషన్ల సందర్భంగా టీడీపీ దాడులు, బెదిరింపులపై ఆరా తీసిన మాజీ ముఖ్యమంత్రి
- ప్రజాస్వామ్యంలో దాడులు, బెదిరింపులకు తావులేదు: వైయస్ జగన్
- ఎన్ని దాడులు చేసినా ధైర్యంగా ఎన్నికల బరిలో నిలిచిన పార్టీ శ్రేణులకు అభినందనలు
- మేయర్ అభ్యర్థి బండి దీప్తిరెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని పిలుపు

- మిగతా 2లో

# లిటిగేషన్లే ఆ పార్టీ రాజకీయం..

## మా రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించండి

- లిటిగేషన్లతో స్థానిక ఎన్నికలు ఆపాలని గొడ్డలి పార్టీ చూస్తోందన్న చంద్రబాబు
- ఎన్నికలు ఆపేందుకు ఏకంగా 62 పిటిషన్లు దాఖలు చేశారని ఆరోపణ
- హింసను వీడి వైసీపీ నేతలు జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపు
- ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ధీమా
- రెండున్నరేళ్ల పాలనను చూసి స్థానిక ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని విజ్ఞప్తి




**పెన్ పవర్ డెస్క్:** న్యాయస్థానాల్లో పిటిషన్లు వేసి ప్రభుత్వ కార్యకలాపాలను అడ్డుకోవడమే ప్రధాన రాజకీయంగా పెట్టుకుని, లిటిగేషన్లతో రాష్ట్రాభివృద్ధిని నిరోధించడమే లక్ష్యంగా 'గొడ్డలి పార్టీ' పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకోవడానికి ఆ పార్టీ చేయని ప్రయత్నం లేదని, అభివృద్ధిని సహించలేని తత్వంతో వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. వారి సిద్ధాంతం క్రిమినలైజేషన్, లిటిగేషన్, ఫేక్ ప్రాపగాండా అయితే.. తమ కూటమి సిద్ధాంతం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అని ఆయన స్పష్టం చేశారు. రెండున్నరేళ్ల తమ కష్టాన్ని గుర్తించి, 2024 ఎన్నికల్లో ఇచ్చినట్లే, ఇప్పుడు

- మిగతా 2లో



# ఉత్తరాంధ్రపై అర్ణబ్ తుపాను పంజా

- మొదలైన తుపాను ప్రభావం.. విశాఖలో విరిగిపడుతున్న చెట్లు, ఉత్తరాంధ్రలో హై అలర్ట్
- విశాఖలో ఈదురుగాలులకు నేలకూలిన చెట్లు, బీచ్‌ల మూసివేత
- యానాం సమీపంలో రేపు తీరం దాటనున్న అతి తీవ్ర తుపాను
- కోస్తా జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు, సహాయక కేంద్రాల ఏర్పాటు
- ప్రాణనష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులకు ప్రభుత్వ ఆదేశాలు

- మిగతా 2లో

# 'ప్రభుత్వం కళ్లముందే ఇదంతా..'

## ఔషధ ధరలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు



**పెన్ పవర్ డెస్క్:** ఔషధాల ధరల్లో భారీ వ్యత్యాసాలపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీసింది. మందుల తయారీదారులు, ఆసుపత్రులు వసూలు చేస్తున్న ధరలకు, వాటిని కొనుగోలు చేసే ధరలకు మధ్య భారీ తేడా ఉండటంపై

- మిగతా 2లో




# మీరు 2.0 అంటే... మేం 10X చూపిస్తాం

## జగన్‌కు పవన్ కల్యాణ్ వార్నింగ్

- జగన్ బెదిరింపులకు ఎవరూ భయపడరన్న పవన్ కల్యాణ్
- రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగా ఉంటుందని వెల్లడి
- ప్రజల మధ్యకు వస్తే వారి మనోభావాలు అర్థమవుతాయని జగన్‌కు సూచన

**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ అధినేత జగన్ వ్యాఖ్యలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీవ్రస్థాయిలో బదులిచ్చారు. వైసీపీ '2.0' అంటూ బెదిరింపులకు దిగితే, ఎన్డీఏ కూటమి '10ఠ' అంటే ఏంటో చూపిస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి ఏర్పాటు చేసిన ఎన్డీఏ మీడియా సమావేశంలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. జగన్ బెదిరింపులకు భయపడేవారు

- మిగతా 2లో



# సామాన్యులకు చంద్రబాబు సర్కారు భారీ ఊరట..

## తక్కువ ధరకే నిత్యావసరాలు

- సామాన్యులకు ఊరట కల్పించేలా ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం
- రేషన్ షాపుల ద్వారా రూ.100కే కిలో కందిపప్పు సరఫరా
- లీటర్ పామాయిల్ రూ.125, కిలో గోధుమ పిండి రూ.25కు అందించేందుకు చర్యలు
- మొబైల్ వాహనాల్లో 'ధరణి' బ్రాండ్ బియ్యం విక్రయాలకు ఆదేశం
- ధరల నియంత్రణకు నెలకు రూ.100 కోట్ల భారం భరించేందుకు ప్రభుత్వం సిద్ధం

- మిగతా 2లో

# జర్నలిజానికి డేటా చట్టం ముప్పు..

## సుప్రీంకోర్టును ఆశ్రయించిన మీడియా సంస్థలు

- మిగతా 2లో





# గంటకు 145 కి.మీ. వేగంతో ఈదురుగాలులు..

## ఉప్పాడ వద్ద ఉగ్రరూపం దాల్చిన తుపాను

**పెన్ పవర్ డెస్క్:** అర్నబ్ తుపాను ప్రభావంతో ఉప్పాడ తీరంలో సముద్రం బీభత్సం సృష్టిస్తోంది. సముద్రంలోని అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. బీచ్ రోడ్డు కోతకు గురైంది. ప్రస్తుతం గంటకు 145-155 కిలోమీటర్ల వేగంగా

- మిగతా 2లో



# ఇన్నేళ్లు 'నా స్టోరీ' వాళ్లు చెప్పారు.. ఇక నావంతు

**పెన్ పవర్ డెస్క్:** కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ తన జీవితంలోని అనుభవాలను పుస్తక రూపంలో పంచుకునేందుకు సిద్ధమయ్యారు.

- మిగతా 2లో

# నవంబర్ 1 నుంచి 1500కే లోకల్ ఫాస్టాగ్ వార్షిక పాస్

**పెన్ పవర్ డెస్క్:** టోల్ ప్లాజాకు సమీపంలో నివసించే వాహనదారులకు కేంద్రం గుడ్‌న్యూస్ చెప్పింది. రాయితీతో కూడిన వార్షిక టోల్ పాస్‌ను తీసుకొచ్చింది. తరచూ టోల్‌ప్లాజా మీదుగా రాకపోకలు సాగించే వారి జేబులకు చిల్లు పడకుండా

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

### గంటకు 145 కి.మీ. వేగంతో ఈదురుగాలులు..

- మొదటి పేజీ తరువాయి

ఈదురుగాలులు వీస్తున్నాయి. ఈదురుగాలుల తీవ్రతకు బండరాళ్లు సైతం కొట్టుకుపోయాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. పల్లిపేట, రంగంపేట గ్రామాలు ముంపుబారిన పడ్డాయి. తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ఉప్పాడ సముద్ర తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ప్రజల తరలింపునకు జిల్లా వ్యాప్తంగా 101 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. బాధితులను బస్సుల్లో పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని కాకినాడ జిల్లా కలెక్టర్ సూచించారు.

**భయపడుతున్న కోనసీమ ప్రజలు..**

కోనసీమ జిల్లాలో ఈదురు గాలులు భీకరంగా వీస్తున్నాయి. ఇళ్ల వద్ద తలుపులు తీసేందుకు సైతం కోనసీమ ప్రజలు భయపడుతున్నారు. వేలాదిగా కొబ్బరి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ఉంటాయని అధికారుల అంచనా. యానాం నుంచి అంతర్వేది మధ్యలో తీరం దాటే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు మరింత అప్రమత్తమయ్యారు.

**తుపాను ల్యాండ్ ఫాల్ ప్రక్రియ ప్రారంభం**

యానాం వద్ద అర్నబ్ తుపాను ల్యాండ్ ఫాల్ ప్రక్రియ ప్రారంభమైంది. ప్రస్తుతం తుపాను తీరాన్ని తాకినట్లుగా అధికారులు సీఎంకు వివరించారు. తీవ్ర తుపాను గమనంపై ఎప్పటికప్పుడు అధికారుల నుంచి సీఎం చంద్రబాబు వివరాలు తెలుసుకుంటున్నారు. బుధవారం తెల్లవారుజామున 4 వరకు ల్యాండ్ ఫాల్ ప్రక్రియ పూర్తి అవుతుందని అధికారులు వివరించారు.

### జర్నలిజానికి డేటా చట్టం ముప్పు..

డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం, 2023లోని కీలక నిబంధనలు జర్నలిజం మనుగడకే ప్రమాదకరంగా మారాయంటూ దేశంలోని ప్రముఖ మీడియా సంస్థలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం, మంగళవారం కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జర్నలిజానికి ప్రత్యేక మినహాయింపులు ఇవ్వకపోవడం వల్ల దర్యాప్తు కథనాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, ప్రచురితమైన వార్తలను తొలగించాల్సి వస్తుందని, రహస్య సోర్సుల వివరాలు బయటపెట్టాల్సి వస్తుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు.దేశంలోని 21 ప్రముఖ మీడియా సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న డిజిటల్ న్యూస్ పబ్లిషర్స్ అసోసియేషన్ (ఐచీూా) ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. కేంద్ర ప్రభుత్వ వాదన వినకుండా చట్టంపై మధ్యంతర స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. పౌరుల హక్కులు, మీడియా హక్కుల మధ్య సమతుల్యత సాధించాల్సిన అవసరం ఉందని సీజేఐ సూర్యకాంత్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. తదుపరి విచారణను నవంబర్ 17కు వాయిదా వేస్తూ, ఈ అంశంపై ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న ఇతర పిటిషన్లతో కలిపి విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

**జర్నలిజానికి ముప్పు తప్పదు: పిటిషనర్ల వాదన**

ఐచీూా తరపున సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, ఈ చట్టం "ముందస్తు సెన్సార్‌షిప్" విధించేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఒక వార్తా కథనం రాయాలంటే, అందులోని వ్యక్తుల అనుమతి కోసం ఎదురుచూడాల్సి వస్తే, ఇక వార్త అనే భావనకే అర్థం ఉండదు. ఈ చట్టం వల్ల న్యూస్ రూమ్‌లు మూతపడతాయి" అని ఆమె కోర్టుకు వివరించారు. గతంలో తీసుకొచ్చిన డేటా పరిరక్షణ చట్టాల ముసాయిదాలలో జర్నలిజానికి మినహాయింపులు ఉండేవని, కానీ తుది చట్టంలో వాటిని తొలగించారని ఆమె గుర్తు చేశారు. చట్టంలోని సెక్షన్ 7, 17(2), 18, 19, 27, 29, 36, 37, 44(3)లతో పాటు, ఖూఖూ రూల్స్, 2025లోని 16, 17, 23 నిబంధనలు రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 19(1)(ఖ)లకు విరుద్ధంగా ఉన్నాయని, వాటిని రద్దు చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ నిబంధనల ప్రకారం, ప్రచురితమైన కథనాలపై వ్యక్తులు అభ్యంతరం తెలిపితే, వారి డేటాను తొలగించాల్సి వస్తుంది. ఇది చారిత్రక రికార్డులను సైతం మార్చే ప్రమాదం ఉందని వారు వాదించారు. అలాగే, సెక్షన్ 36 ప్రకారం, ప్రభుత్వం ఎలాంటి జ్యుడీషియల్ పర్యవేక్షణ లేకుండా మీడియా సంస్థల నుంచి సమాచారం కోరవచ్చని, ఇది రహస్య సోర్సుల గోప్యతకు భంగం కలిగిస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే రూ.250 కోట్ల వరకు జరిమానా విధించడం చిన్న, ప్రాంతీయ మీడియా సంస్థల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని తెలిపారు.

**ఆర్‌టీఐ చట్టం నిర్వీర్యం**

ఇదే చట్టంలోని సెక్షన్ 44(3) ద్వారా సమాచార హక్కు చట్టం, 2005లోని సెక్షన్ 8(1)(య)ని సవరించడాన్ని కూడా పిటిషనర్లు సవాల్ చేశారు. ఈ సవరణ వల్ల, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా కూడా వ్యక్తిగత సమాచారాన్ని పొందడం కష్టతరం అవుతుందని, ఇది పారదర్శకతకు గొడ్డలిపెట్టు అని వాదించారు. 2023లో ఆమోదం పొందిన ఈ చట్టానికి సంబంధించిన నిబంధనలను ప్రభుత్వం 2025లో నోటిఫై చేసింది. 2027 మే నుంచి పూర్తిస్థాయిలో అమలులోకి రానుంది. జర్నలిజానికి మినహాయింపులు కోరుతూ ఐచీూా ఇప్పటికే కేంద్ర సమాచార, ప్రసార, ఐటీ మంత్రిత్వ శాఖలతో చర్చలు జరిపినా ఫలితం లేకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈయూ, యూకే, సింగపూర్ వంటి దేశాల్లోని డేటా చట్టాల్లో జర్నలిజానికి స్పష్టమైన మినహాయింపులు ఉన్నాయని పిటిషనర్లు గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చే సమాధానం తర్వాత ఈ కేసు విచారణ కీలక దశకు చేరుకోనుంది.

### సామాన్యులకు చంద్రబాబు సర్కారు భారీ ఊరట..

రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసరాల ధరల నుంచి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ధరల నియంత్రణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కందిపప్పు, పామాయిల్, గోధుమ పిండి వంటి సరుకులను అందుబాటు ధరలకు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వంపై నెలకు రూ.100 కోట్ల అదనపు భారం పడినా, ప్రజలకు మేలు చేకూర్చడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

**దీపావళి నాటికి రేషన్ షాపుల్లో రాయితీ సరుకులు**

నిత్యావసరాల ధరల నియంత్రణపై పౌరసరఫరాల శాఖ అధికారులతో సీఎం చంద్రబాబు మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.170 నుంచి రూ.200 పలుకుతున్న కందిపప్పును రేషన్ కార్డుదారులకు కేవలం రూ.100కే అందించాలని నిర్ణయించారు. అదేవిధంగా, లీటర్ పామాయిల్‌ను రూ.125కు, కిలో గోధుమ పిండిని రూ.25కే సరఫరా చేయాలని ఆదేశించారు. దీపావళి పండుగ నాటికి ఈ సరుకుల పంపిణీని ప్రారంభించేలా యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నిర్ణయం వల్ల లక్షలాది పేద, మధ్యతరగతి కుటుంబాలకు ధరల భారం నుంచి పెద్ద ఊరట లభించనుంది.

**'ధరణి' బియ్యం ఇక మండల కేంద్రాల్లోనూ..**

ప్రభుత్వం 'ధరణి' బ్రాండ్ పేరుతో రైతు బజార్లలో విక్రయిస్తున్న నాణ్యమైన బియ్యాన్ని ఇకపై రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, మండల కేంద్రాలకు విస్తరించాలని సీఎం ఆదేశించారు. మొబైల్ వాహనాల ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ.49, సూపర్ ఫైన్ రకాన్ని రూ.50 చొప్పున విక్రయించాలని స్పష్టం చేశారు. బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలను అదుపు చేసేందుకు రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ అసోసియేషన్లతో ప్రభుత్వం జరిపిన చర్చలు ఫలించాయి. బీపీటీ స్టీమ్ బియ్యాన్ని కిలో రూ.66కు, సాధారణ స్టీమ్ బియ్యాన్ని రూ.47కు మించకుండా విక్రయించేందుకు మిల్లర్లు అంగీకరించినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పొరుగు రాష్ట్రాలకు ధాన్యం అక్రమ రవాణాను అడ్డుకునేందుకు సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా పటిష్టం చేయాలని చంద్రబాబు ఆదేశించారు.

**ఉల్లి ధరల నియంత్రణకు చర్యలు**

ఉల్లి ధరల నియంత్రణకు ప్రభుత్వం ఇప్పటికే జోక్యం చేసుకుని రైతు బజార్లలో కిలో రూ.35కే విక్రయిస్తున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే మరో 800 మెట్రిక్ టన్నుల ఉల్లిని అందుబాటులోకి తెచ్చి ధరలు మరింత తగ్గేలా చూస్తామని హామీ ఇచ్చారు. కర్నూలు నుంచి కొత్త పంట మార్కెట్‌కు వస్తే ధరలు పూర్తిగా అదుపులోకి వస్తాయని అంచనా వేశారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను నిరంతరం పర్యవేక్షించాలని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా తక్షణమే జోక్యం చేసుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, ధరల పెరుగుదల నుంచి ప్రజలను కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, పౌరసరఫరాల శాఖ కార్యదర్శి కన్నబాబు తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కడప కార్పొరేషన్ నేతలతో శ్రీ వైయస్ జగన్ భేటీ

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రిద వైయస్ జగన్ పులివెందులలో కడప నగరపాలక సంస్థకు చెందిన పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో సమావేశమయ్యారు. కడప కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో తాజా రాజకీయ పరిణామాలు, ఎన్నికల సన్నాహాలు, నామినేషన్ల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. నామినేషన్ల దాఖలు సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు చేసిన దాడులు, బెదిరింపులపై శ్రీ వైయస్ జగన్ ఆరా తీశారు. ఆయా ఘటనలకు సంబంధించిన వివరాలను పార్టీ నేతలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ఎదురైన ఆటంకాలు, పార్టీ అభ్యర్థులు ఎదుర్కొన్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీ వైయస్ జగన్ మాట్లాడుతూ, అధికార బలంతో ప్రతిపక్షాలను అణచివేయాలని చూడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఎన్నికల్లో ప్రజల తీర్పే అంతిమమని, దాడులు, బెదిరింపులతో ప్రజాస్వామ్య ప్రక్రియను అడ్డుకోలేరని స్పష్టం చేశారు. నామినేషన్ల సందర్భంగా జరిగిన దాడులు, బెదిరింపులపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ని దాడులు చేసినా, ఎన్ని ఇబ్బందులు సృష్టించినా వెనక్కి తగ్గకుండా ధైర్యంగా పోరాడి ఎన్నికల బరిలో నిలిచిన పార్టీ నాయకులు, కార్యకర్తలను శ్రీ వైయస్ జగన్ అభినందించారు. పార్టీ శ్రేణులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ఎలాంటి పరిస్థితుల్లోనూ సంయమనం కోల్పోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాడాలని సూచించారు. కడప కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ నేతలంతా ఐక్యంగా, సమన్వయంతో పనిచేయాలని శ్రీ వైయస్ జగన్ దిశానిర్దేశం చేశారు. మేయర్ అభ్యర్థి బండి దీప్తిరెడ్డి గెలుపునకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని శ్రీ వైయస్ జగన్ కోరారు. ఎన్నికల్లో పోటీ చేసే హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల నిర్వహణ అధికారులపై ఉందన్నారు. ఈ సమావేశంలో కడప ఎంపీ వైయస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, మేయర్ అభ్యర్థి బండి దీప్తిరెడ్డి, మాజీ మేయర్లు సురేష్‌బాబు, పాకా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రపై అర్ణబ్ తుపాను పంజా

అర్ణబ్ తుపాను ప్రభావం ఉత్తరాంధ్ర జిల్లాలపై, ముఖ్యంగా విశాఖపట్నంపై స్పష్టంగా కనిపించడం ప్రారంభమైంది. మంగళవారం ఉదయం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. బలమైన ఈదురుగాలులతో కూడిన వర్షం నగరంలోని పలు ప్రాంతాలను ముంచెత్తింది. గాలి తీవ్రతకు మహారాణిపేట అంగడిదిబ్బ వద్ద ఓ చెట్టు విరిగి పాన్ షాపుపై పడటంతో అది ధ్వంసమైంది. రామ్ నగర్ సేవాసదన్ స్కూల్ సమీపంలో మరో చెట్టు రోడ్డుకు అడ్డంగా కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికారులు విశాఖలోని ఆర్‌కే బీచ్, రుషికొండ బీచ్‌లను పూర్తిగా మూసివేశారు. పర్యాటకులు, స్థానికులు సముద్ర తీరానికి రావద్దని తీవ్రంగా హెచ్చరించారు.

తుపాను ప్రభావం శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ అధికంగా ఉంది. శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం, గార, లావేరు, ఆమదాలవలస, పొందూరు సహా 12 మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాదాపు 4.65 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ వరి పంట కోతకు సిద్ధంగా ఉండగా, ఈదురుగాలులకు పంట నేలవాలుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతానికి వరి కోతలు చేపట్టవద్దని వ్యవసాయ అధికారులు సూచించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితిని సమీక్షిస్తూ, జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. విజయనగరం జిల్లాలోనూ పలుచోట్ల ఈదురుగాలులతో వర్షాలు పడుతుండటంతో, కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి లోతట్టు ప్రాంతాల ప్రజలను సహాయక కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో ఈరోజు, రేపు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. తుపాను వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. తీరప్రాంత, లోతట్టు గ్రామాల్లోని ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు, సహాయక కేంద్రాలకు తరలించాలని ఆదేశించారు. మూడు జిల్లాల్లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌లు పనిచేయాలని, సహాయక కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మొక్కజొన్న, పత్తి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, తుపాను బలహీనపడిన తర్వాత గ్రామస్థాయిలో ఆస్తి, పంట నష్టాన్ని అంచనా వేయాలని పేర్కొన్నారు.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకారం.. 'అర్ణబ్' అతి తీవ్ర తుపానుగా మారి, అక్టోబర్ 28వ తేదీ మధ్యాహ్నానికి బాపట్ల, విశాఖపట్నం మధ్య యానాం సమీపంలో తీరం దాటే అవకాశం ఉంది. తీరం దాటే సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగానికి చేరవచ్చని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. అధికారులు ఇప్పటికే బాపట్ల జిల్లాలోని చీరాల, ఓడరేవు, రామాపురం బీచ్‌లను మూసివేశారు. మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించి, తమ పడవలను నిజాంపట్నం హార్బర్ జెట్టీ వంటి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాకినాడ జిల్లాలో 101 సహాయక కేంద్రాలను ఏర్పాటు చేసి, కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ (0884-2356801, 98499 03879)లను అందుబాటులోకి తెచ్చారు. విద్యుత్ సంబంధిత సమస్యల కోసం 1912 టోల్-ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని ఏపీఈపీడీసీఎల్ సూచించింది. మొత్తంమీద, అర్ణబ్ తుపానును ఎదుర్కొనేందుకు ఏపీ ప్రభుత్వం సర్వసన్నద్ధమైంది.

## లిటిగేషన్లే ఆ పార్టీ రాజకీయం.. మా రెండున్నరేళ్ల కష్టాన్ని గుర్తించండి

- మొదటి పేజీ తరువాయి

స్థానిక ఎన్నికల్లో కూడా చారిత్రాత్మక మద్దతుతో కూటమిని ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌లతో కలిసి నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ వ్యవహరిస్తున్న తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర విమర్శలు గుప్పించారు. "రాజకీయ పార్టీకి ఉండాల్సిన లక్షణాలు ఆ పార్టీకి లేవు. రాష్ట్రానికి మంచి జరగడం, అభివృద్ధి జరగడం వారికి ఇష్టం లేదు. అందుకే, ఎట్టి పరిస్థితుల్లోనూ స్థానిక సంస్థల ఎన్నికలు జరగనీయకుండా చూడాలన్నదే వారి ఆలోచన. ఈ ఎన్నికలను ఆపడానికి ఏకంగా 62 పిటిషన్లు వేశారు. సర్వేపైనా, డీలిమిటేషన్ పైనా, బీసీ రిజర్వేషన్లపైనా కోర్టులకెక్కారు. ఇప్పుడు ఎన్నికలు జరగకపోతే కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులు ఆగిపోతాయి. స్థానిక సంస్థలు అభివృద్ధి చెందడం ఆ పార్టీకి ఇష్టం లేదు. బెంగళూరు నుంచి వచ్చి హిట్ అండ్ రన్ తరహాలో దాడులు చేస్తున్నారు. తీవ్రవాదుల్లా వ్యవహరిస్తున్నారు. గొడ్డలి పార్టీ నేతలు ఈ హింసా విధానాన్ని విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలి" అని చంద్రబాబు హితవు పలికారు. తమ ప్రభుత్వ సహనాన్ని, సంయమనాన్ని కూడా ఆ పార్టీ దుర్వినియోగం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఆస్తుల కోసం సొంత చెల్లెల్ని, తల్లిని మోసం చేస్తున్నారు. అతని ఆలోచన ప్యాలెస్ కోసం, మా తపన పేద ప్రజల కోసం. గొడ్డలి పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని సమర్థంగా దాటుకుని ముందుకెళతాం" అని వివరించారు.

**ట్రిపుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి వేగం**

గత ప్రభుత్వ పాలన విధ్వంసంతోనే సాగిందని, ప్రజాకంటక పాలనను అంతమొందించడానికే ప్రజలు కూటమికి చారిత్రాత్మక తీర్పు ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. "విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మించే బాధ్యతను ప్రజలు మాకు అప్పగించారు. ఎల్ నినో కరవు పరిస్థితులు, అర్ణబ్ తుపాను వంటి ప్రకృతి విపత్తులు ఎదురైనా ఎక్కడా అభివృద్ధి ఆగకుండా చర్యలు తీసుకున్నాం. బటన్ నొక్కుతున్నాం కానీ గుంతలు పూడ్చలేమని గత పాలకులు చేతులెత్తేస్తే, మేం సంక్షేమం అందిస్తూనే అభివృద్ధి చేసి చూపిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టుల నుంచి డేటా సెంటర్ల వరకు ప్రతిచోటా అభివృద్ధి కనిపిస్తోంది" అని అన్నారు. విశాఖ, అమరావతి, తిరుపతి కేంద్రాలుగా మూడు ఎకనామిక్ రీజియన్లను అభివృద్ధి చేస్తున్నామని, గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద రూ.27 వేల కోట్ల ప్రాజెక్టు రాష్ట్రానికి వచ్చిందని తెలిపారు. గత పాలకులు గోదావరిలో ముంచేసిన పోలవరం ప్రాజెక్టును వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు. రెండున్నరేళ్లలో ప్రతి రంగంలో మార్పు తీసుకొచ్చి, ప్రతి కుటుంబానికీ న్యాయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ అభివృద్ధిని కొనసాగించడానికి స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి 'ట్రిపుల్ ఇంజన్' ప్రభుత్వానికి శక్తినివ్వాలని ప్రజలను కోరారు.

**సీట్ల సర్దుబాటుపై అపూర్వ కసరత్తు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు కోసం తాను, పవన్ కల్యాణ్ గతంలో ఎన్నడూ చేయనంత కసరత్తు చేశామని చంద్రబాబు తెలిపారు. "ఎంపీటీసీ స్థాయి వరకు సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించాం. జనాభా దామాషా ప్రకారం సోషల్ ఇంజనీరింగ్ ఆధారంగానే సీట్లు కేటాయించాం. కూటమి ధర్మాన్ని పాటిస్తూ బీ-ఫాం ఇచ్చిన అభ్యర్థుల గెలుపునకే నేతలు, కార్యకర్తలు కృషి చేయాలి. పార్టీ నిర్ణయానికి వ్యతిరేకంగా ఎవరూ వ్యవహరించవద్దు. ప్రస్తుతం సీట్లు ఇవ్వలేని వారికి భవిష్యత్తులో తప్పక న్యాయం చేస్తాం" అని ఆయన స్పష్టం చేశారు.

## 'ప్రభుత్వం కళ్లముందే ఇదంతా..' ఔషధ ధరలపై సుప్రీం కీలక వ్యాఖ్యలు

- మొదటి పేజీ తరువాయి

తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజల ప్రాణాలకు సంబంధించిన అంశాన్ని కేవలం వ్యాపార కోణంలో చూడకూడదని స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన న్యాయస్థానం అక్టోబర్ 27, 2026న తన తీర్పును రిజర్వ్ చేసింది.

**రూ.11 వేల ఇంజెక్షన్‌కు రూ.1.30 లక్షలా?**

క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే కీమోథెరపీ ఇంజెక్షన్‌ను డీలర్ ధరకు రూ.11 వేలకే పొందే అవకాశం ఉన్నప్పటికీ, ఓ ప్రైవేటు ఆసుపత్రి అదే ఇంజెక్షన్‌కు రూ.1.30 లక్షలు వసూలు చేసిన ఘటనను ధర్మాసనం ప్రస్తావించింది. ఇంత భారీ ధర వ్యత్యాసానికి సమర్థన ఏమిటని ప్రశ్నించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం.. ఔషధాల గరిష్ఠ చిల్లర ధర (ఎంఆర్‌పీ), రిటైలర్లకు విక్రయించే ధర మధ్య ఇంత తేడా ఎందుకు ఉంటోందని కేంద్రాన్ని నిలదీసింది. ప్రభుత్వ పర్యవేక్షణలోనే ఇవన్నీ జరుగుతున్నాయని వ్యాఖ్యానించింది.

**అన్ని మందులకూ ధరల నియంత్రణ ఎందుకు లేదు?**

ప్రస్తుతం ధరల నియంత్రణ పరిధిలోకి వచ్చే మందులకు నిర్దేశిత గరిష్ఠ ధరలు వర్తిస్తుండగా, ఆ జాబితాలో లేని అనేక ఔషధాల ప్రారంభ ధరలను తయారీదారులు నిర్ణయిస్తున్నారు. ఈ విధానంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు లేవనెత్తింది. క్యాన్సర్ మందులకే కాకుండా ఇతర అత్యవసర ఔషధాల ధరలపైనా నియంత్రణ అవసరాన్ని పరిశీలించింది. మరోవైపు, ఔషధాల ధరలను నిర్ణయించేటప్పుడు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలు, మందుల లభ్యత, పరిశ్రమ అభివృద్ధి, పోటీ వంటి అంశాల మధ్య సమతుల్యత పాటించాల్సి ఉంటుందని కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదించారు. అయితే, రోగుల ప్రాణాలకు సంబంధించిన విషయంలో అధిక ధరల భారాన్ని ఎలా సమర్థిస్తారని ధర్మాసనం ప్రశ్నించింది.

**తీర్పుపై ఆసక్తి**

న్యాయవాది కిషన్ చంద్ జైన్ దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో జనరిక్ మందుల ప్రిస్క్రిప్షన్లను తప్పనిసరి చేయడం, ధరల నియంత్రణ పరిధిలో లేని మందుల ప్రారంభ ధరలకు పరిమితులు విధించడం, వైద్య వినియోగ వస్తువులపై వాణిజ్య మార్జిన్లను నియంత్రించడం వంటి అంశాలను లేవనెత్తారు. ఈ పిటిషన్లపై వాదనలు విన్న సుప్రీంకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. మందుల ధరల నియంత్రణపై న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఇప్పుడు కీలకంగా మారింది.

## నవంబర్ 1 నుంచి 1500కే లోకల్ ఫాస్టాగ్ వార్షిక పాస్

- మొదటి పేజీ తరువాయి

ఈ లోకల్ పాస్ అందుబాటులోకి తెచ్చింది. టోల్‌ప్లాజాలకు 20 కి.మీ.లోపు పరిధిలోని వ్యక్తిగత వాహనదారులు ఈ పాస్ తీసుకోవచ్చు. దీని ధరను రూ.1500గా నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ సంబంధిత నిబంధనలను సవరించింది. నవంబర్ 1 నుంచి ఈ రాయితీ పాస్ అందుబాటులోకి రానుంది.

మున్సిపాలిటీ, పట్టణ పరిధిలో ఉంటే రూ.3వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఒక్క టోల్‌ప్లాజాకే వర్తిస్తుంది. ఇతర రూట్లలో పని చేయదు. జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలపై ప్రయాణించేటప్పుడు యథాతథంగా రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ ప్రత్యామ్నాయ మార్గం లేదా సర్వీసు రోడ్డు ఉన్నా లోకల్ పాస్ జారీ చేయరు. కమర్షియల్ వాహనాలకు ఇది వర్తించదు. ప్రస్తుతం వ్యక్తిగత వాహనదారులకు వార్షిక పాస్ రూ.3 వేలకు లభ్యమవుతోంది. దీని సాయంతో ఏడాది లేదా 200 ట్రిప్పులు (ఏది ముందైతే అది) చెల్లుబాటు అవుతుంది. ఏటా ఏప్రిల్ 1న ఛార్జీలను కేంద్రం సవరించే అవకాశం ఉంటుంది.

## ఇన్నేళ్లు 'నా స్టోరీ' వాళ్లు చెప్పారు.. ఇక నావంతు

- మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలుగా తన గురించి ఇతరులే కథనాలు రాశారని, ఇప్పుడు తన కథను తానే చెప్పుకునే సమయం వచ్చిందని ఆమె పేర్కొన్నారు. తన పుస్తకం విడుదలకు ముందు సోషల్ మీడియాలో పంచుకున్న వీడియోలో ఈ విషయాలను వెల్లడించారు.

**నవంబర్ 10న పుస్తకం విడుదల**

సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' (దీవశ్రీశీఅస్త్రఱఅస్త్: ూ జీశీబతీఅవఎ శీట ాాశీజవ) పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది. ఈ పుస్తకంలో ఇటలీలో గడిపిన బాల్యం నుంచి భారత్‌లో తన జీవితం, రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం, రాజకీయ పరిణామాల వరకు అనేక వ్యక్తిగత అనుభవాలను వివరించినట్లు సమాచారం. తన గురించి గతంలో వచ్చిన కొన్ని కథనాల్లో వాస్తవాలకు విరుద్ధమైన వివరాలు ఉన్నాయని, మరికొన్ని విషయాలను అతిశయోక్తిగా చిత్రీకరించారని సోనియా అభిప్రాయపడ్డారు. తన పుస్తకం చదివిన తర్వాత కొందరి అభిప్రాయాలు మారవచ్చని, మరికొందరు తనను భిన్నంగా అర్థం చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు. పుస్తకం విడుదల సందర్భంగా కొంత చర్చ, వివాదం చోటుచేసుకోవచ్చని కూడా సోనియా గాంధీ సంకేతాలిచ్చారు. ఇన్నాళ్లూ ఇతరులు చెప్పిన తన జీవిత కథకు బదులుగా, తన అనుభవాలను స్వయంగా ప్రజల ముందుకు తీసుకురావాలన్నది ఆమె ఉద్దేశంగా కనిపిస్తోంది.

## ఇన్నేళ్లు 'నా స్టోరీ' వాళ్లు చెప్పారు.. ఇక నావంతు

- మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలుగా తన గురించి ఇతరులే కథనాలు రాశారని, ఇప్పుడు తన కథను తానే చెప్పుకునే సమయం వచ్చిందని ఆమె పేర్కొన్నారు. తన పుస్తకం విడుదలకు ముందు సోషల్ మీడియాలో పంచుకున్న వీడియోలో ఈ విషయాలను వెల్లడించారు.

**నవంబర్ 10న పుస్తకం విడుదల**

సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' (దీవశ్రీశీఅస్త్రఱఅస్త్: ూ జీశీబతీఅవఎ శీట ాాశీజవ) పుస్తకం నవంబర్ 10న విడుదల కానుంది. ఈ పుస్తకంలో ఇటలీలో గడిపిన బాల్యం నుంచి భారత్‌లో తన జీవితం, రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం, రాజకీయ పరిణామాల వరకు అనేక వ్యక్తిగత అనుభవాలను వివరించినట్లు సమాచారం. తన గురించి గతంలో వచ్చిన కొన్ని కథనాల్లో వాస్తవాలకు విరుద్ధమైన వివరాలు ఉన్నాయని, మరికొన్ని విషయాలను అతిశయోక్తిగా చిత్రీకరించారని సోనియా అభిప్రాయపడ్డారు. తన పుస్తకం చదివిన తర్వాత కొందరి అభిప్రాయాలు మారవచ్చని, మరికొందరు తనను భిన్నంగా అర్థం చేసుకోవచ్చని ఆమె పేర్కొన్నారు.పుస్తకం విడుదల సందర్భంగా కొంత చర్చ, వివాదం చోటుచేసుకోవచ్చని కూడా సోనియా గాంధీ సంకేతాలిచ్చారు. ఇన్నాళ్లూ ఇతరులు చెప్పిన తన జీవిత కథకు బదులుగా, తన అనుభవాలను స్వయంగా ప్రజల ముందుకు తీసుకురావాలన్నది ఆమె ఉద్దేశంగా కనిపిస్తోంది.

## మీరు 2.0 అంటే... మేం 10x చూపిస్తాం

- మొదటి పేజీ తరువాయి

ఇక్కడ ఎవరూ లేరని పవన్ స్పష్టం చేశారు. బలహీనులు మాత్రమే బెదిరింపుల భాష మాట్లాడతారని, బలవంతులు ఎప్పుడూ అలా చేయరని అన్నారు. ఇలాంటి మాటల వల్లే గత ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన విషయాన్ని మరువరాదని అన్నారు. వైసీపీ 1.0 పాలనలో జరిగిన హింసను తాము ధైర్యంగా ఎదుర్కొన్నామని, ప్రజలకు అండగా ఎలా నిలవాలో తమకు బాగా తెలుసని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించినట్లుగా, జగన్ ప్రజల్లోకి వస్తే వారి కష్టాలు, మనోభావాలు అర్థమవుతాయని పవన్ హితవు పలికారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ఐక్యంగానే ఉంటుందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు వంటి సంక్లిష్టతలు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రగతి కోసం కలిసికట్టుగా ముందుకు సాగుతామని తెలిపారు. రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా మాట్లాడాలి తప్ప హెచ్చరికలు జారీ చేయకూడదని సూచించారు. ఇదే సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, వైసీపీ నేతల ప్రవర్తన వల్ల సమాజం నష్టపోతోందని విమర్శించారు.

పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప

# 2024 ఎన్నికలకు మించి సర్వేపల్లిలో టీడీపీలోకి చేరికలు



**- వైసీపీ నుంచి రోజురోజుకూ పెరుగుతున్న చేరికలతో అత్యంత బలమైన శక్తిగా తెలుగుదేశం పార్టీ**

**- తోటపల్లి గూడూరు మండలం మల్లికార్జునపురానికి చెందిన 36 కుటుంబాలు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిక**

**నెల్లూరు అక్టోబర్ 27 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

అల్లీపురంలో జరిగిన కార్యక్రమంలో వారికి కండువాలు కప్పి ఆత్మీయఆహ్వానంపలికిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

అనంతరం సోమిరెడ్డి మాట్లాడుతూ

మల్లికార్జునపురం నా దత్తత గ్రామం..ప్రస్తుతం ఆ గ్రామ బాధ్యతలను SEIL కంపెనీ చేపట్టింది

మా ఆధ్వర్యంలో పెద్దఎత్తున జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఆకర్షితులై టీడీపీలో చేరిన 36 దళిత, గిరిజన కుటుంబాలకు ఆత్మీయ స్వాగతం పలుకుతున్నా

గ్రామస్తుల కోసం ఒక్కొక్కటి రూ.30 లక్షలకు పైగా విలువజేసే రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించాను

280 కుటుంబాలకు కంపెనీ నిత్యజీవితంలో ఉపయోగపడే వస్తువులతో కూడిన వెల్ కం కిట్లు రాజు xగా అందజేసింది

30 కుటుంబాలకు గొర్రెలు, మరో 30 కుటుంబాలకు మేకలు అందజేశారు..రెండో విడతలోమిగిలినకుటుంబాలకుకూడాఅందజేయను న్నారుపెరటితోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నారు..

ఆర్థికాభివృద్ధి సాధించేదిశగా సహకారం అందిస్తున్నారుగిరిజనులు, దళితులు ఎక్కువగా ఉండే మల్లికార్జునపురాన్ని గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నేను దత్తత తీసుకున్నాను

ప్రభుత్వ నిధులకు అదనంగా ఖర్చు చేసి పేదలకు ప్రత్యేక పర్యవేక్షణతో నాణ్యతతో కూడిన ఇళ్లు కట్టించాం

నియోజకవర్గా వ్యాప్తంగా గిరిజనులు, దళితుల అభ్యున్నతిపై ప్రత్యేక దృష్టి పెట్టాం

నిత్యం టీడీపీలో చేరికలు జరుగుతుండటం చాలా సంతోషంగా ఉంది

2024 ఎన్నికలకు మించి చేరికలు కొనసాగుతున్నాయి...పొదలకూరు మండలంలోనూ మొదటి సారి టీడీపీకి విశేష స్పందన లభిస్తుంది

ప్రజలందరి మద్దతుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో భారీ విజయాలు సాధించబోతున్నాం

కూటమి ప్రభుత్వంలో చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీసుకున్న నిర్ణయాలు పంచాయతీలు, మండల పరిషత్, జిల్లా పరిషత్ లకు వరంగా మారాయి

ఆర్థిక సంఘం నిధులతో పాటు స్థానిక సంస్థలకు వచ్చే ఏ నిధులు డైవర్ట్ కాకూడదని, ప్రతి రూపాయి పల్లెల బాగుకే ఉపయోగపడాలని నిర్ణయం తీసుకున్నారు

విద్యారంగంలో నారా లోకేష్ విశేష మార్పులు తెస్తున్నారు...ఒక కుటుంబంలో ఎంత మంది బిడ్డలు చదువుకుంటే అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేస్తున్నారు

ఆడపడుచులకు స్త్రీశక్తి పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకంతో ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు అందుతున్నాయి

అన్నదాత సుఖీభవ పథకంలో కేంద్ర ప్రభుత్వ రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి ఏడాదికి రూ.20 వేలు రైతులకు అందిస్తోంది

సర్వేపల్లి అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర నిధులతో పాటు సీఎస్ఆర్ ఫండ్ ను సద్వినియోగం చేసుకుంటున్నాం..

టీడీపీలో చేరిన వారిలో కత్తి శ్రీను, పచ్చా రాజేష్, గంధళ్ల ఇంద్ర, కత్తి శివకృష్ణ, చలంచర్ల వెంకటరమణయ్య, కవరగిరి శ్రీను, తుపాకుల అరవింద్, ఈగా సనత్ కుమార్, పోట్లూరు హేమంత్, బోడెద్దుల శీనయ్య, శీలం మణి, కత్తి పుల్లయ్య, గంధళ్ల మణి తదితరులు

# జిల్లాలో జడ్పీటీసీలుగా పోటీ చేస్తున్న అభ్యర్ధులకు బీఫాం లు అందజేత




**నెల్లూరు అక్టోబర్ 27 పెన్ పవర్ స్టేట్ బ్యూరో**

నెల్లూరు జిల్లాలోని జిల్లా టిడిపి పార్టీ కార్యాలయం ఈరోజు ఉదయం జిల్లా టిడిపి అధ్యక్షుడు బీద రవిచంద్ర, పార్టీ అబ్జర్వర్ గుండె రాకేష్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంత్ రెడ్డి లు కలిసి జిల్లాలో్గాజ లుగా పోటీ చేస్తున్న అభ్యర్ధులకు బీఫాం లు అందించారు, ఈ నేపథ్యంలో ఆత్మకూరు నియోజకవర్గానికి సంబంధించి టిడిపి పార్టీకి వ్యతిరేకంగా పనిచేస్తూ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేసిన వారికి జనసేన పార్టీకి చెందిన కొందరికి బి ఫామ్ లు అందించారన్న సమాచారంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నేరుగా జిల్లా టిడిపి కార్యానికి చేరుకుని బీఫాంలో అందించిన జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర అబ్జర్వర్ గుండె రాకేష్ లపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు, తన నియోజకవర్గానికి సంబంధించిన టిడిపి అభ్యర్థులకు కాకుండా రెబల్ గా పోటీ చేసిన వారిని టిడిపి కార్యాలయం లోకి ఎలా అనుమతిస్తారని తనకు తెలియకుండా జనసేన పార్టీకి చెందిన నేతలకు బీఫాంలో ఎలా అందిస్తారని, టిడిపి మండలాధ్యక్షుడు నే బెదిరించారని, తెరచాటు రాజకీయాలు చేయడం ఎంతవరకు సమంజసమని ఇప్పటికే ఎన్ని జరుగుతున్నా తలవంచుకుని పోతున్నానని తాను తల ఎత్తితే ఇక్కడ రాజకీయాలు చేయలేరని జిల్లా రాజకీయాలు శాసిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని ఇదంతా గమనించాలనిరాజకీయాలుతెలిసినసోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దీని గురించి మాట్లాడాలని తీవ్ర స్థాయిలో బీదపై ఆగ్రహం వ్యక్తం చేశారు, మంత్రి ఆనం ఆగ్రహం వెనుక అసలు కారణం ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన ఓ నేత టిడిపి పార్టీలోనే ఉంటూ ఆనంకు వ్యతిరేకంగా గ్రూపు రాజకీయాలు చేస్తున్నాడు అతనికి జిల్లా అధ్యక్షుడు మద్దతు తెలుపుతూ ఉన్నాడనేది ఆనం ఆగ్రహం వెనుకున్న అసలు కారణమని టిడిపిలో చర్చి నడుస్తుంది.

# ఎన్నికల నిర్వహణలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

**- పోలింగ్‌కు ముందు, పోలింగ్ సమయంలో, పోలింగ్ ముగిసిన తర్వాత ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలి**

**- ఎన్నికల నిబంధనల అమలుపై అప్రమత్తంగా ఉండాలి.. నివేదికలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలి**

**- జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్**




**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 27:-**

మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక పాత్ర పోషించాలని జాయింట్ కలెక్టర్ జి. సూరజ్ ధనుంజయ్ సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను క్షుణ్ణంగా అవగాహన చేసుకుని, పోలింగ్ ప్రక్రియలో ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించాలని స్పష్టం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై సూక్ష్మ పరిశీలకులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జెసి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేలా నిశితంగా పరిశీలించడంలో సూక్ష్మ పరిశీలకులు (మైక్రో అబ్జర్వర్లు) కీలక పాత్ర పోషించాలని సూచించారు. పోలింగ్‌కు ముందు, పోలింగ్ సమయంలో, పోలింగ్ ముగిసిన అనంతరం చేపట్టాల్సిన విధులపై సూక్ష్మ పరిశీలకులు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో పరిస్థితులు, ఓటర్లకు కల్పించిన సదుపాయాలు, బలహీన వర్గాల ఓటర్లపై ఒత్తిళ్లు లేదా ఆధిపత్య ధోరణులు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు వంటి అంశాలను తటస్థంగా పరిశీలించాలన్నారు.

**నిబంధనల అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

పోలింగ్ కేంద్రాల వెలుపల ఓటర్లకు తగిన స్థలం, ఓటరు గుర్తింపు కార్డులు, ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉన్నాయా లేదా గమనించాలని సూచించారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల ప్రచారం జరుగుతున్నా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోలింగ్ ప్రారంభానికి ముందు బ్యాలెట్ బాక్సును ఖాళీగా చూపించడం, సీలింగ్ ప్రక్రియను నిబంధనల ప్రకారం నిర్వహించడం, పోలింగ్ ఏజెంట్ల హాజరు, ఎన్నికల సామగ్రి వినియోగం వంటి అంశాలను పరిశీలించాలని తెలిపారు.

**అనెక్సర్-3 మార్గదర్శకాల ప్రకారం నివేదికలు**

ఎన్నికల సంఘం నిర్దేశించిన అనెక్సర్–3లోని మార్గదర్శకాలను అనుసరించి పరిశీలన చేపట్టాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అందించిన ప్రశ్నావళిలోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితుల ఆధారంగా ‘అవును’ లేదా ‘కాదు’ రూపంలో సమాధానాలు నమోదు చేయాలని, నివేదికలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని స్పష్టం చేశారు. సూక్ష్మ పరిశీలకులు ఎలాంటి పక్షపాతానికి తావివ్వకుండా, ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా విధులు నిర్వహిస్తూ, పోలింగ్ ప్రక్రియలో పారదర్శకతను నిర్ధారించేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. డిఆర్ఓ రామునాయక్, ఎల్డియం అయ్యపురెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

# ఎన్నికల నేపథ్యంలో పింఛన్ల పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు చేయాలి



**- అక్టోబర్ 30న పింఛన్ల పంపిణీ.. 29న నగదు ఉపసంహరణకు చర్యలు**

**- బ్యాంకు శాఖల్లో నగదు కొరత లేకుండా చూడాలి: జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 27**

నవంబర్ 1న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, నవంబర్ 3న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో, పింఛన్ల పంపిణీకి ఎలాంటి ఆటంకాలు కలగకుండా పటిష్టమైన ముందస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతికి లోబడి అక్టోబర్ 30న పింఛన్ల పంపిణీ చేపట్టేందుకు, అక్టోబర్ 29న నగదు ఉపసంహరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంబంధిత రీజినల్ మేనేజర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ బ్యాంకు శాఖల్లో తగినంత నగదు అందుబాటులో ఉండేలా చూడాలని, నగదు కొరత కారణంగా పింఛనుదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పింఛన్ల పంపిణీని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

# ఉపరాష్ట్రపతికి ఘన వీడ్కోలు



**- రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సాదర స్వాగతం**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 27:**

తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమైన భారత ఉపరాష్ట్రపతి శ్రీ సి.పి. రాధాకృష్ణన్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రితో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఉపరాష్ట్రపతికి సాదరంగా వీడ్కోలు తెలిపారు.

# నంద్యాల జిల్లా వ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్ల ఉపసంహరణకు పటిష్ట పోలీసు బందోబస్తు....

**- చెక్ పోస్ట్ ల వద్ద 24/7 విస్తృత తనిఖీలు....**

**నంద్యాల ప్రతినిధి పెన్ పవర్ అక్టోబర్ 27**






నంద్యాల జిల్లా వ్యాప్తంగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా జిల్లా పోలీసు శాఖ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, ఐపీస్ ఆదేశాల మేరకు, ఆయా సబ్ డివిజన్ పోలీసు అధికారుల సూచనలతో సంబంధిత పోలీసు అధికారులు తమ సిబ్బందితో కలిసి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎంపీడీవో కార్యాలయాల వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నామినేషన్ల ఉపసంహరణ సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు.

అలాగే, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని నియమించి 24/7 తనిఖీలు నిర్వహిస్తున్నారు. నంద్యాల జిల్లాలోకి అక్రమంగా నగదు, మద్యం, ఇతర నిషేధిత వస్తువులు రవాణా కాకుండా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా, పారదర్శకంగా, ప్రశాంతంగా కొనసాగేందుకు పోలీసు శాఖ అప్రమత్తంగా విధులు నిర్వహిస్తోంది. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసు శాఖ స్పష్టం చేసింది.

# కూటమి అభ్యర్ధులకు బీ-ఫారాలు అందజేసిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి





**సమన్వయంతో పనిచేసి మండల పరిషత్ ఎన్నికల్లో అఖండ విజయం సాధిద్దాం**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 27:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీకాళహస్తిలోని తన నివాసంలో తొట్టంబేడు మండల ఎంపీటీసీ అభ్యర్థులకు బీ–ఫారాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు, సముచిత ప్రాధాన్యం కల్పించడం తమ బాధ్యతని పేర్కొన్నారు. కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో, ఐక్యంగా పనిచేసి మండల పరిషత్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించేలా కృషి చేయాలని సూచించారు.

ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులు విజయపథంలో దూసుకెళ్లేలా ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తల సమష్టి కృషి, ప్రజల ఆశీస్సులతో ఈ ఎన్నికల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకుందామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలపై కమిషనర్ క్షేత్రస్థాయి పరిశీలన





**- తుఫాన్ సెంటర్‌లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాలపై ఆరా**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్,అక్టోబర్ 27:**

శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని తుఫాన్ సెంటర్ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్ పర్యటించి, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరుగుతున్నాయా, వీధి దీపాలు సక్రమంగా వెలుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించారు. శానిటేషన్ సిబ్బంది ప్రతిరోజూ ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరిస్తున్నారా అని వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించడంతో పాటు, పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఈ పర్యటన ద్వారా అధికార యంత్రాంగం దృష్టి సారించింది.

## శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ



**- ఘనస్వాగతం పలికిన ఆలయ అధికారులు, పండితులు..**
**భక్తులకు స్వామీజీ అనుగ్రహం**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 27:**

మైసూరు అవధూత దత్త పీఠం ఉత్తరాధికారి పరమపూజ్య శ్రీదత్త విజయానంద తీర్థస్వామీజీ శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వామీజీ క్షేత్ర సందర్శన సందర్భంగా ఆలయ అధికారులు, వేద పండితులు ఘనస్వాగతం పలికి, స్వామివారి దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. అనంతరం స్వామీజీ భక్తులను ఆశీర్వదించి, విశేషంగా అనుగ్రహించారు. స్వామీజీ దర్శనంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

## పెళ్లకూరు మండల పీఠం తెలుగుదేశం పార్టీ కైవసం....



**పెళ్లకూరు, పెన్ పవర్, అక్టోబర్ 27**

తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలంలో జరిగిన స్థానిక ఎంపీటీసీ ఎన్నికలలో మండలంలో మొత్తం పది స్థానాలు ఉండగా నామినేషన్ గడువు ముగించడంతో అందులో ఏడు స్థానాలు తెలుగుదేశం పార్టీ దక్కించుకోగా ఒక్క స్థానం బిజెపి కైవసం అయింది. మిగిలిన రెండు స్థానాల్లో అనగా కలవకూరు, పాలచురు ఎంపీటీసీ స్థానాలకు పోటీ ఉంది . పెళ్లకూరు మండల అధ్యక్ష స్థానం ఎస్సీ మహిళకు కేటాయించారు. నెల్లబల్లి సెగ్మెంట్ నుంచి పోటీ చేసిన తెలుగుదేశం అభ్యర్థి ఓజిలి అరుణకుమారి అధ్యక్షులు అయ్యే అవకాశం ఉంది. ఎంపీటీసీలుగా ఎన్నికైన అభ్యర్థుల వివరాలు, కలవకూరు, శాఖమూరి హరికృష్ణ టిడిపి (జనరల్), తలవాయిపాడు పెళ్లకూరు. రత్నమ్మ జనరల్ మహిళ టిడిపి , చావాలి ఎద్దల.నరేందర్ రెడ్డి బిజెపి జనరల్, శిరసనం బేడు పెళ్లకూరు.గుణవతి టిడిపి జనరల్ మహిళ, రోసనోరు పల్లమాల చంద్రయ్య టిడిపి ఎస్సీ, పునాబాక కొమ్ము సుబ్రహ్మణ్యం ఎస్టి టిడిపి, నెల్లబల్లి ఓజిలి అరుణకుమారి ఎస్సీ మహిళ,పెళ్లకూరు తడగల. అమరావతి ఎస్సీ మహిళ మండల పీఠం దక్కించుకోనున్న ఓజిలి అరుణకుమారి.

## రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ ఆకస్మికంగా తనిఖీ చేసిన డాక్టర్ నాగశశిభూషణ్ రెడ్డి

**పెన్ పవర్ రొంపిచర్ల మండలం అక్టోబర్ 27**

చిత్తూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగశశిభూషణ్ రెడ్డి ఈరోజు రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి పిహెచ్సి నందు డాక్టర్లు ప్రజలు మెచ్చుకుని లాగా ఆరోగ్య సేవలు అందిస్తే సానుకూల పనితీరు తో పాటు పిహెచ్ గ్రేడింగ్ పెరుగుతుందన్నారు. ప్రతి ఆసుపత్రుల లోపల, బయట పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని వైద్యాధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రికి సంబంధించిన అన్ని రికార్డులను,మాతా శిశు సంరక్షణ సేవలను ఎప్పటికప్పుడు నవీకరణ గా ఉంచాలని, పిహెచ్సి నందు కాన్పులు అయ్యేలాగా చూడాలన్నారు. అలాగే సంజీవిని కార్యక్రమం, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్, తదితర ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ, సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు 100 శాతం అప్‌లోడ్ చేయాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆకస్మిక తనిఖీల ద్వారా ఆసుపత్రుల్లో సేవల నాణ్యత, పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ మరియు ఆరోగ్య



కార్యక్రమాల అమలును నిరంతరం పర్యవేక్షిస్తామని డాక్టర్ నాగశశిభూషణ్ రెడ్డి తెలిపారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ డి యస్ ఓ చిత్తూరు, స్థానిక వైద్యాధికారులు డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, డాక్టర్ వినయ్,అమ్మాణ్ణి సి హెచ్ ఓ, రాజేశ్వరి మండల ఆరోగ్య విద్యాధికారి, పంకజ హెల్త్ సూపర్వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితుడికి అంజూరు శ్రీనివాసులు పరామర్శ

**- రుయా ఆసుపత్రిలో వైద్య చికిత్స వివరాల ఆరా..**
**మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు విజ్ఞప్తి**

**శ్రీకాళహస్తి,పెన్ పవర్, అక్టోబర్ 27:**

శ్రీకాళహస్తి మండలం జగరాజుపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ దళిత నాయకుడు పండుగ గురువయ్య (కండువా గురవయ్య)ను శ్రీకాళహస్తీశ్వర స్వామివారి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు మంగళవారం పరామర్శించారు.

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాలు విరగడంతో తిరుపతిలోని రుయా



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గురువయ్యను అంజూరు శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి కలిశారు.

ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, ధైర్యంచెప్పారు.

త్వరగాకోలుకోవాలనిఆకాంక్షించారు.అనంతరం గురువయ్యకు అందిస్తున్న వైద్య చికిత్స వివరాలను సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయనకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించి, త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులకు విజ్ఞప్తి చేశారు.

ఈ పరామర్శ కార్యక్రమంలో నాయకులు పగడాల రాజు, వేలూరు రమేష్, ప్రసాద్, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలకు జనసేన సమరశంఖం

### ఎంపీటీసీ అభ్యర్థులకు బి-ఫారాల అందజేత.. ప్రజాసేవే లక్ష్యంగా ముందడుగు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్,అక్టోబర్ 27:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ సమాయత్తమవుతోంది. ఎన్నికల బరిలో నిలవనున్న జనసేన ఎంపీటీసీ అభ్యర్థులకు బి-ఫారాలు అందజేసి, ఎన్నికల కార్యాచరణపై పార్టీ నాయకులు దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారుడు ఆరణి మదన్ సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా అభ్యర్థులకు బి-ఫారాలు అందజేస్తూ, ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రచార ప్రణాళిక, నాయకులుకార్యకర్తల మధ్య సమన్వయం తదితర అంశాలపై సూచనలు చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త క్రమశిక్షణతో, సమష్టి కృషితో పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని నాయకులు సూచించారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండేలా అభ్యర్థులు తమ కార్యాచరణను రూపొందించుకోవాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ స్థానిక సంస్థల ఎన్నికల సమన్వయకర్త ఎం. హరి, శ్రీకాళహస్తి ఆలయ చైర్మన్, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి ఎస్. కొట్టే ప్రసాద్, ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యులు డి. నరేంద్ర, ఎస్. ప్రవీణ్, జనసేన నాయకులు పెటా బ్రదర్స్ (చిరంజీవి, చంద్ర), పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, అభిమానులు పాల్గొన్నారు.

## రాత్రి 8 గంటలు దాటినా తేలని ఎంపీటీసీ లెక్కలు




**- తొట్టంబేడులో ఉత్కంఠ.. ఏకగ్రీవాలపై కొనసాగుతున్న సందిగ్ధత**
**- తుది జాబితా కోసం అభ్యర్థులు, అనుచరుల ఎదురుచూపులు**

**తొట్టంబేడు, పెన్ పవర్, అక్టోబర్ 27:**

తొట్టంబేడు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. నామినేషన్ల ఉపసంహరణ, ఏకగ్రీవాల ఖరారు ప్రక్రియ సోమవారం రాత్రి 8 గంటలు దాటినా కొలిక్కి రాకపోవడంతో అభ్యర్థులు, వారి అనుచరుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 27 ఉపసంహరణకు చివరి గడువు కావడంతో ఉదయం నుంచే మండల పరిషత్ కార్యాలయం వద్ద రాజకీయ సందడి కనిపించింది.

ఏకగ్రీవాలపై ఇంకా వీడని ఉత్కంఠ

మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు దాఖలైన నామినేషన్ల పరిశీలన అనంతరం పలువురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. అయితే ఏయే స్థానాల్లో ఏకగ్రీవం ఖరారైంది? ఎక్కడ పోటీ కొనసాగనుంది? అనే అంశాలపై అధికారిక ప్రకటన వెలువడకపోవడంతో ఉత్కంఠ కొనసాగుతోంది.

రాత్రి 8 గంటలు దాటినా ఎన్నికల రిటర్నింగ్ అధికారులు మండల పరిషత్ కార్యాలయంలోనే ఉండి ఉపసంహరణ పత్రాల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. మరోవైపు ఎన్నికల ఫలితాలపై స్పష్టత కోసం అభ్యర్థులు, వారి అనుచరులు కార్యాలయం వద్దే వేచి చూస్తున్నారు.

అప్పీళ్ల పరిష్కారంతో మరింత ఆలస్యం

తిరుపతి జిల్లా పరిధిలో తొట్టంబేడు జెడ్పీటీసీ స్థానంతో పాటు ఎంపీటీసీ స్థానాలకు సంబంధించిన అప్పీళ్ల పరిష్కార ప్రక్రియ కూడా కొనసాగుతున్న నేపథ్యంలో తుది జాబితా వెల్లడిలో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఉపసంహరణ గడువు ముగిసి, సంబంధిత పత్రాల పరిశీలన పూర్తయిన అనంతరం పోటీలో మిగిలిన అభ్యర్థుల తుది జాబితాను అధికారులు ప్రకటించనున్నారు. ఆ జాబితా వెలువడిన తర్వాతే ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలపై పూర్తి స్పష్టత రానుంది. అప్పటివరకు తొట్టంబేడు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల ఉత్కంఠ కొనసాగనుంది.

## పెళ్లకూరు జెడ్పిటిసి అభ్యర్థుల ఖరారు..







**- టిడిపికి సిరసనంభేటీ చైతన్య కృష్ణారెడ్డి,**
**- వైకాపా కి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి..**
**- ప్రధాన పార్టీల మధ్య పోరు సిద్ధం..**

**పెళ్లకూరు, పెన్ పవర్, అక్టోబర్ 27**

తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలం, పెళ్లకూరు జడ్పిటిసి జనరల్ స్థానానికి కేటాయించడంతో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి. శిరసానంబేడు గ్రామానికి చెందిన శిరసనం భేటీ చైతన్య కృష్ణారెడ్డిని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. వైయస్సార్సిపి పార్టీ ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు గ్రామానికి చెందిన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అభ్యర్థత్వాన్ని ఖరారు చేసింది. ఈరోజు నామినేషన్ ఘట్టం పూర్తయి అభ్యర్థులు ఖరారు కావడంతో ఇరుపార్టీలలో కార్యకర్తలలో నెలకొన్న నిశబ్దతకు తెరపడింది. తెలుగుదేశం పార్టీలో యువకుడైన చైతన్య కృష్ణారెడ్డికి సీటు రావడంతో ఆ పార్టీలో అందరిలోనూ ఆనందం వ్యక్తం అవుతుంది. వైయస్సార్సిపి పార్టీలో సీనియర్ నాయకుడిగా వివిధ పదవులలో నిర్వహించిన వ్యక్తిగా ఆ పార్టీలో ముందుకెళ్తుంది. అయితే గత కొంతకాలంగా పెళ్ళకూరు మండలంలో రెండు పార్టీల మధ్య వివిధ రకాలుగా వివాదాలు నడుస్తూ ఉన్నాయి. 2024 ఎన్నికల్లో ముగిసిన తరువాత జరిగిన వివాదాలు లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి జైలుకు వెళ్లి వచ్చారు. ఆ తరువాత కలవకూరు ఇసుక రీచ్ లో జరిగిన వివాదం తో పాటు మరికొన్ని పాత కేసులు తోడు కావడంతో మూడు నెలల పాటు జైలులో ఉన్నారు. ఆ తరువాత జైలు నుంచి బయట వచ్చి గుడ్ మార్నింగ్ పేరుతో ప్రజలలోకి వెళ్లడంతో వివాదాలు రేపుతున్నాడని దేశం పార్టీలు అడ్డుకోవడంతో ఇరు పార్టీలు మధ్య తీవ్రమైన ఘర్షణలు చోటు చేసుకున్నాయి. వైయస్సార్ సిపి అభ్యర్థి చిర్లకూరు గ్రామం నివాసి కాగా.తెలుగుదేశం పార్టీ అభ్యర్థి చిల్లకూరు గ్రామ అల్లుడు. ఇరువురి మధ్య గత కొంతకాలంగా రాజకీయ వివాదాలు ఉన్నాయి. దీనితోపాటు ఇటీవల తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు విగ్రహాన్ని చిల్లకూర్లో సత్యనారాయణ రెడ్డి ఇంటి పక్కన ఎమ్మెల్యే భూమి పూజ చేయడంతో విరు పార్టీల మధ్య తీవ్రమైన వివాదాలు ఏర్పడి కేసులు వరకు వెళ్లిన సంఘటనలు జరిగాయి. ఆ తరువాత సత్యనారాయణ రెడ్డి పొలం దగ్గర అక్రమాలు ఉన్నాయంటూ దేశం పార్టీ ఆరోపించడం ఇరు పార్టీ కార్యకర్తలు పొలం దగ్గరికి చేరుకోవడంతో వివాదాలు ఏర్పడి తెలుగుదేశం పార్టీకి చెందిన బాలయ్య అనే కార్యకర్త చనిపోవడం జరిగింది దీనికి కారణం సత్యనారాయణ రెడ్డి మరి కొంతమంది బాలయ్య కుటుంబ సభ్యులు కేసు పెట్టడంతో ప్రస్తుతము వైయస్సార్సిపి అభ్యర్థి అయిన సత్యనారాయణ రెడ్డి నెల్లూరు కేంద్రకారాగారంలో నిందితుడిగా ఉన్నారు. వారు ప్రస్తుతం జైలు నుంచే జడ్పిటిసి అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు.దీనితో రెండు పార్టీల మధ్య పోటీ ఆసక్తిగా నెలకొనవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం కూటమి పార్టీ అధికారంలో ఉండడం స్థానిక శాసన సభ్యురాలు కూటమి పార్టీకి చెందిన వ్యక్తి కావడం, అధిక ఎంపీటీసీలు దేశం పార్టీ కైవాసం కావడం వల్ల నాకు అవకాశం కల్పిస్తే మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిలో నిలపతామని దేశం పార్టీ అభ్యర్థి చెపుతుండగా. అయితే అన్ని గమనిస్తున్న పెళ్ళాకూరు ప్రజానికం నివ్వూరు గప్పిన నిప్పులా నిశ్శబ్దంగా ఉన్నారు.

## వార్డుల విభజనలో గందరగోళం.. వైసీపీ అభ్యంతరం

**- ఆర్‌డీఓ, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం..**
**ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి**

**శ్రీకాళహస్తి, పెన్ పవర్, అక్టోబర్ 27:**

శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పునర్విభజనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. వార్డుల విభజనలో చోటుచేసుకున్న తేడాలను సరిచేసి, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతూ ఆర్‌డీఓ భానుప్రకాష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా వైసీపీ నాయకులు మాట్లాడుతూ.. వార్డుల పునర్విభజనలో కొన్ని అసమానతలు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఒకే కుటుంబానికి చెందిన తండ్రి ఒక వార్డులో ఓటరుగా ఉండగా, ఆయన పిల్లల ఓట్లు మరో వార్డులో నమోదైన పరిస్థితులు ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇలాంటి సమస్యల వల్ల ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, వార్డుల విభజనలో ఉన్న లోపాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా ప్రతి అభ్యర్థికి నామినేషన్ దాఖలు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ నాయకులు సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించి, అభ్యంతరాలను తప్పకుండా



పరిశీలిస్తామని సంబంధిత అధికారులు హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పఠాన్ ఫరీద్, హరి, కంటా ఉదయ్, పెరుమాళ్, దేవి తదితరులు పాల్గొన్నారు.

## పదవి హోదా కాదు బాధ్యతగా ఉంటాను ఆళ్ళ శిరీష.

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్,, 27,**

ఇది మీ వాడ కాదు... మన వాడ. నేను మీ ఆడబిడ్డగా , మీ ఇంటి ఆడపిల్లగా ఇక్కడకు వచ్చాను . ఓట్లు అడగటానికి కాదు మీ ఆశీస్సులు తీసుకోవటానికి అంటూ గుండారావు పేటలోని ప్రజల ఆశీస్సులు తీసుకున్నారు 30 వార్డ్ జనసేన పార్టీ అభ్యర్థి ఆళ్ళ శిరీష. ప్రచారంలో భాగంగా మంగళవారం గుండారావు పేటలో పర్యటించ్చారు. ఆమెకు కూటమి నాయకులు స్థానిక ప్రజలు పూలు జల్లుతూ , బాణాసంచా కాల్చుతూ ఘనస్వాగతం పలికారు. చెక్కల బజార్ నుంచి మొదలైన ప్రచారం గుండారావు పేట మీదుగా జెండా చెట్టు ( పెరుగు బజార్ ) వరకు ఆద్యంతం మన వార్డు మన ఆడబిడ్డ నినాదంతో ఆ ప్రాంతమంతా మారు మ్రోగింది. ఈ సందర్భంగా ఆళ్ళ శిరీష మాట్లాడుతూ మనందరికీ ఓటు హక్కు ఇచ్చింది డాక్టర్ బీ ఆర్ అంభేద్కర్ రాసిన రాజ్యాంగమని , జనసేనాని పవన్ కళ్యాణ్ ఎప్పుడూ అంబేద్కర్ ఆశయాల కోసమే నిలబడతారని అన్నారు. ఈ డివిజన్ లో



నెలకొన్న మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక శ్రద్ద తీసుకుంటానని శిరీష అన్నారు. అనంతరం శిరీష విజయం సాధించాలంటూ చర్చి ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.కూటమి నాయకులు లాం వర్ధనరావు, దళ వాయి కిషోర్ , యాకోబు , వలపర్ల రాజా , , యోహాను , తదితరులు పాల్గొన్నారు

## పందిళ్లపల్లి2లో ఆవుల అశోక్ ప్రచార జోరు<sub></sub>ఆవుల

### అశోక్‌కు పెరుగుతున్న ప్రజా మద్దతు

**వేటపాలెం, అక్టోబర్ 27, (పెన్ పవర్) :**

వేటపాలెం మండలం పందిళ్లపల్లి2 ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేస్తున్న ఆవుల అశోక్ ఎన్నికల ప్రచారాన్ని విస్తృతం చేశారు. పార్టీ బీ-ఫారం అందుకున్న అనంతరం గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడటంతో పాటు స్థానిక సమస్యలను తెలుసుకుంటూ తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థిస్తున్నారు.

**అభివృద్ధి, ప్రజా సమస్యలపై హామీలు**గ్రామంలోని మౌలిక వసతులు, ప్రజలకు ఎదురవుతున్న సమస్యలు, అభివృద్ధి అవసరాలను ప్రస్తావిస్తూ అశోక్ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులవారీగా ప్రచారం నిర్వహిస్తూ తన అభ్యర్థిత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. తన ప్రచారానికి ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని, ఎన్నికల్లో విజయం సాధిస్తాననే నమ్మకం ఉందని అశోక్ తెలిపారు. పందిళ్లపల్లి2 ఎంపీటీసీ ఎన్నికల



బరిలో అభ్యర్థుల ప్రచారం ఊపందుకోవడంతో గ్రామంలో రాజకీయ సందడి నెలకొంది.

# కేంద్ర ప్రభుత్వ సహకారంతో గుంటూరు అభివృద్ధికి భారీగా నిధులు మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్

**గుంటూరు:పెన్ పవర్, అక్టోబర్, 27,**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో గుంటూరు ప్రాంతంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో దాదాపు రూ.700 కోట్లతో, 100 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులతో పలు రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలోని 41, 43 డివిజన్లలో మేయర్ అభ్యర్థిని కోవెలమూడి లక్ష్మీ అపర్ణ అలాగే కార్పొరేటర్ అభ్యర్థినులు అయిన రంగావజ్జుల గాయత్రి బెహరా గాయత్రి కు మద్దతుగా స్థానిక ఎమ్మెల్యే గల్లా మాధవి తో కలిసి గ్రామీణ అభివృద్ధి కమ్యూనికేషన్స్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ ప్రచార కార్యక్రమాల్లో మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ....

గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో నందివెలుగు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నిధులతో పనులు పూర్తి కావస్తున్నాయని, నవంబర్ నెలాఖరులోగా ప్రారంభోత్సవం చేసుకునేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు.

శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు అందించగా, భూసేకరణ కోసం నగరపాలక సంస్థ నుంచి రూ.50 కోట్లు కేటాయించినట్లు వివరించారు. మొత్తం రూ.150 కోట్లతో చేపట్టిన ఈ పనులను వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గడ్డిపాడు వద్ద రూ.150 కోట్లతో, పెదపలకలూరు వద్ద రూ.70 కోట్లతో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. శ్యామలానగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జికి సంబంధించి రానున్న ఆరు నెలల్లో టెండర్ల ప్రక్రియను ముందుకు తీసుకెళ్లి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు.

రాజధాని అమరావతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.15,000 కోట్ల మేర సహకారం అందించిందని డా. పెమ్మసాని తెలిపారు. జాతీయ రహదారుల నిర్మాణం, అభివృద్ధితో పాటు గుంటూరు రైల్వే స్టేషన్‌ను ఆధునిక సదుపాయాలతో సుందరంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర నిధులతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం ఆర్థికంగా బలపడుతూ, తయారీ రంగంలో స్వావలంబన దిశగా ముందుకు సాగుతోందని డా. పెమ్మసాని పేర్కొన్నారు. 2014లో దేశంలో రెండు మొబైల్ ఫోన్ తయారీ యూనిట్లు మాత్రమే ఉండగా, ప్రస్తుతం 300కు పైగా తయారీ యూనిట్లు ఉన్నాయని వివరించారు. భారతదేశంలో తయారవుతున్న మొబైల్ ఫోన్లు దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి అవుతున్నాయని తెలిపారు.

గుంటూరు అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించండిగుంటూరు నగరంలో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి ప్రాధాన్యం




ఇస్తున్నామని డా. పెమ్మసాని తెలిపారు. కోవెలమూడి నాని మేయర్‌గా ఉన్న కాలంలో నగరంలోని పలు ప్రాంతాల్లో వందల కోట్ల రూపాయలతో రహదారులు, డ్రైనేజీ పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. మిగిలిన సమస్యలను కూడా దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

గుంటూరు మేయర్ అభ్యర్థిని కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ప్రజల సమస్యలను అర్థం చేసుకుని, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లగల నాయకురాలని అన్నారు. ఆమెతో పాటు కూటమి బలపరిచిన కార్పొరేటర్ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం గుంటూరు అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని గుర్తించి, కూటమి అభ్యర్థులను గెలిపించడం ద్వారా నగరానికి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకురావడానికి అవకాశం కల్పించాలని డా. పెమ్మసాని చంద్రశేఖర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అధికారం పోయినా జగన్‌లో బెదిరింపుల ధోరణి మారలేదు మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి, పెన్ పవర్,అక్టోబర్ 27:**

గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ ఉడత బెదిరింపులకు భయపడేవారెవరూ లేరని.. ఇప్పుడు మీ టైం, తర్వాత మా టైం అంటూ వడ్డీతో చెల్లిస్తామని పోలీసులను హెచ్చరించడం మానుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పగటి కలలు కనడానికి ఎవరి అనుమతీ అవసరం లేదు... కానీ ఆ కలలతో అధికారులను భయపెట్టాలనుకోవడం మీ భ్రమ మాత్రమే. ప్రజాస్వామ్యంలో ఎవరి టైం నడవాలో నిర్ణయించేది ప్రజలే తప్ప మీ బెదిరింపులు కాదు అని మంత్రి అచ్చెన్నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆడలేక మద్దెల ఓడన్నట్లు గత ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పులపై సమాధానం చెప్పకుండా పోలీసులపై ప్రతీకార హెచ్చరికలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికార యంత్రాంగాన్ని రాజకీయ ప్రయోజనాలకు వాడుకున్నారనే విమర్శలు ఎదుర్కొన్న జగన్, ఇప్పుడు అదే అధికారులను బెదిరించడం విడ్డూరమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా జరిగిన హింసను జగన్ మర్చిపోయినా రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. 2020లో నామినేషన్ల సందర్భంగా గుంటూరు, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో ఘర్షణలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. మాచర్లలో టీడీపీ నాయకులు బోండా ఉమామహేశ్వరరావు, బుద్ధా వెంకన్న ప్రయాణిస్తున్న కారుపై దాడి జరిగిన విషయాన్ని ప్రస్తావించారు. నామినేషన్ల సమయంలో హింసపై వచ్చిన ఫిర్యాదులతో గుంటూరు, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల బదిలీలకు అప్పటి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం వాస్తవం కాదా అని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను హైకోర్టు కొట్టివేసిన చరిత్ర ఎవరిదని ప్రశ్నించారు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అన్నట్లు నాడు జరిగినవన్నీ మర్చిపోయి ఇప్పుడు ప్రజాస్వామ్యంపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ ఉపన్యాసాలు ఇవ్వడం విడ్డూరమన్నారు.

సొంత పార్టీ ఎంపీటీసీ అభ్యర్థి అనపర్తి మణికంఠపై దాడి ఘటనలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాపై కేసు నమోదవడం వైసీపీలో కార్యకర్తలకు దక్కుతున్న గౌరవాన్ని ప్రశ్నిస్తోందన్నారు. క్షణికావేశంలో తొందరపడ్డానని స్వయంగా రాజా చెప్పిన తర్వాత కూడా జగన్ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. పుంగనూరులో జరిగిన ఎన్నికల ఘర్షణల్లో కూటమి నాయకులు గాయపడిన విషయాన్ని గుర్తుచేశారు. మిథున్ రెడ్డి సృష్టించిన హింసాఖాశీడ, కారుతో కూటమి నాయకులను, కార్యకర్తలను గుద్దిన ఘటన జగన్కు కనపడటం లేదా అని ప్రశ్నించారు. మేనమామ అంటే తండ్రితో సమానం. అలాంటి స్థానంలో ఉన్న జగన్ తన మేనకోడలి వివాహ వేడుక వేదిక విషయంలో సొంత చెల్లి షర్మిలతో వివాదానికి దిగడం బాధాకరం అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. భద్రతా కారణాలు ఉన్నాయని చెబుతున్న జగన్, కుటుంబ సభ్యుల మధ్య సమస్యను సామరస్యంగాఎందుకుపరిష్కరించుకోలేక పోతున్నారని ప్రశ్నించారు. ప్రస్తుత స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ, వైసీపీ సహా ప్రతి పార్టీ అభ్యర్థి స్వేచ్ఛగా నామినేషన్ వేస్తున్నారని, ఎక్కడైనా ఆటంకాలు ఎదురైతే ఎన్నికల సంఘం కఠిన చర్యలు తీసుకుంటున్నారని స్పష్టం చేశారు. జగన్ పాదయాత్రలు చేసిన.. పొర్లుదండాలు పెట్టినా ప్రజల విశ్వాసాన్ని పొందలేరని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# భరత్ రెడ్డి ఆధ్వర్యంలో చేరిన వైసీపీ మాజీ కార్పొరేటర్ డివిజన్ అధ్యక్షుడు టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 27,**

గొడ్డలి పార్టీ దుకాణం మూసివేసేందుకు ఎక్కువ రోజులు లేవని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఇతర పార్టీల నుంచి నాయకులు వస్తున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం స్థానిక తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో టీడీపీ నాయకులు భరత్ రెడ్డి ఆధ్వర్యంలో రెండో డివిజన్ వైఎస్ఆర్ సీపీ మాజీ కార్పొరేటర్ మర్రి అంజలి, ఆమె భర్త వైఎస్అర్ సీపీ డివిజన్ అధ్యక్షుడు మర్రి సత్యనారాయణ తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే నసీర్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ సీపీ అంటేనే అరాచకమని విమర్శించారు. గత ఐదేళ్ల వైసీపిజ పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని మండిపడ్డారు. కనీసం రాజధాని కూడా లేని రాష్ట్రంగా మార్చిన దుర్మార్గమైన పాలన వైసీపీదన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత పదేళ్లుగాబఅభివృద్ధి అనే మాట ఎక్కడా కనిపించలేదని అన్నారు. ప్రధాన రోడ్లను సైతం గుంతలుగా మార్చిన దయనీన దయనీయ స్థితిలో ఉందన్నారు. కుహటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్ల కాలంలోనే 400 కోట్ల రూపాయలతోగుంటూరుతూర్పునియోజకవర్గం లోఅభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. నూతనంగా పార్టీలో చేరిన అంజలి,



సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు నాయుడు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై తెలుగుదేశం పార్టీలో చేరామని తెలిపారు.

# గుంటూరులో 367 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగం

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 27,**

నగరంలో స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 367 మంది ఉద్యోగులు మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని నగరపాలక సంస్థ కమిషనర్, అడిషనల్ ఎలక్షన్ అథారిటీ కె. మయూర్ అశోక్ తెలిపారు.

ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఓటు హక్కు కోల్పోకుండా ఉండేందుకు అక్టోబర్ 27, 28 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఏ.సి. కాలేజీలో



పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సదుపాయం కల్పించినట్లు వెల్లడించారు.

ఓటింగ్ కోసం ప్రత్యేక కౌంటర్లు, హెల్ప్ డెస్క్, గోప్యతతో కూడిన ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బుధవారం కూడా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉందని, ఉద్యోగులు ఓటరు గుర్తింపు కార్డు, ఎన్నికల విధుల కేటాయింపు ఉత్తర్వులు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

# సర్వదయ కాలనీ ఎంపీటీసీ బరిలో ఉప్పాల దీప్తి




**వేటపాలెం, అక్టోబర్ 27, (పెన్ పవర్):**

వేటపాలెం పంచాయతీ పరిధిలోని సర్వదయ కాలనీ ఎంపీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఉప్పాల దీప్తి పోటీ చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం ఆమెకు బీ–ఫారం అందజేయడంతో అభ్యర్థిత్వం ఖరారైంది. దీంతో సర్వదయ కాలనీ ఎంపీటీసీ స్థానంలో ఎన్నికల సందడి మొదలైంది.

**ఓటర్లను కలుస్తూ మద్దతు కూడగట్టే యత్నం**

బీ–ఫారం అందుకున్న అనంతరం ఉప్పాల దీప్తి ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమవుతున్నారు. కాలనీ పరిధిలోని ప్రజలను కలుసుకుని స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు తనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తానని ప్రజలకు వివరిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. సర్వదయ కాలనీ ఎంపీటీసీ స్థానంలో ఇతర పార్టీల అభ్యర్థుల పోటీతో ఎన్నికల వాతావరణం మరింత ఆసక్తికరంగా మారనుంది.

# ట్రిపుల్ ఇంజిన్ ప్రభుత్వంతో రాష్ట్ర అభివృద్ధికి మరింత వేగం వనతి శ్రీనివాసన్

**గుంటూరు:పెన్ పవర్, అక్టోబర్, 27,**

ఆంధ్రప్రదేశ్‌లో ట్రిపుల్ ఇంజిన్ ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలకాలని బీజేపీ ఆంధ్రప్రదేశ్ కో–ఇన్‌చార్జ్ వనతి శ్రీనివాసన్ విజ్ఞప్తి చేశారు. గుంటూరు నగరంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా 10, 22, 24, 41, 43, 39వ డివిజన్లలో పోటీ చేస్తున్న కూటమి బీజేపీ అభ్యర్థులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, మల్లాల లక్ష్మీనారాయణ, కావటి విక్రమ్ నాయుడు, బెహరా గాయత్రి, రంగావజ్జుల గాయత్రి, బాదం శ్రీనివాస్‌లకు మద్దతుగా ఆమె ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వనతి శ్రీనివాసన్ మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సుపరిపాలనను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు కేంద్రంలో, రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వాలకు తోడుగా స్థానిక సంస్థల్లోనూ ఎన్డీఏ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

గుంటూరు నగరానికి అమృత్ పథకం సహా పలు అభివృద్ధి ప్రాజెక్టులు అందాయని,



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని తెలిపారు.

బీజేపీ అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారని, అన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి సానుకూల స్పందన లభిస్తోందని వనతి శ్రీనివాసన్ అన్నారు. ఎన్డీఏ అభ్యర్థుల విజయంతో స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి మరింత తోడ్పాటు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రత్యేకంగా బ్రాడీపేటలోని 41వ డివిజన్ కూటమి బీజేపీ అభ్యర్థి బెహరా గాయత్రి, 43వ డివిజన్ కూటమి బీజేపీ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఇద్దరూ విద్యావంతులని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయగల సామర్థ్యం ఉన్న అభ్యర్థులని తెలిపారు.

43వ డివిజన్ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి సీనియర్ పార్టీ కార్యకర్త కుమార్తె అని, యువతిగా, విద్యావంతురాలిగా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారని వనతి శ్రీనివాసన్ పేర్కొన్నారు. ఆమె విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ఇన్‌ఛార్జి యాళ్ల దొరబాబు, యడ్లపాటి స్వరూపరాణి, యామిని శర్మ, దర్శనపు శ్రీనివాస్, నడ్డి నాగమల్లేశ్వరి, శనక్కాయల రాధామాధవి, బొల్లాప్రగడ శ్రీదేవి, హరిపావని, పాలపాటి రవికుమార్, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ వెలగలేటి గంగాధర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నాలుగు ఎంపీటీసీ స్థానాలకు వైఎస్సార్ కాంగ్రెస్ అభ్యర్థులు

**- బీ-ఫారాలు అందజేసిన పార్టీ అభ్యర్థులు**

**వేటపాలెం, అక్టోబర్ 27, (పెన్ పవర్) :**

వేటపాలెం మండలంలో జరగనున్న ఎంపీటీసీ ఎన్నికలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. వేటపాలెం పంచాయతీ పరిధిలోని నాలుగు ఎంపీటీసీ స్థానాలకు పార్టీ తరఫున పోటీ చేయనున్న అభ్యర్థులకు బీ–ఫారాలు సమర్పించారు. దీంతో ఆయా స్థానాల్లో పార్టీ అభ్యర్థిత్వం ఖరారైంది.

వేటపాలెం మెయిన్ ఎంపీటీసీ స్థానానికి షేక్ షాహిన బేగం, రెడ్ల బజార్ స్థానానికి నాయుడు మనీషా, సర్వోదయ కాలనీ స్థానానికి ఉప్పాల దీప్తి, చిన్న బజార్ స్థానానికి కూచిపూడి జాన్ అంబేద్కర్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున బీ–ఫారాలు అందుకున్నారు.

**నాలుగు స్థానాల్లో పోటీకి పార్టీ శ్రేణుల సన్నద్ధత**

బీ–ఫారాల సమర్పణతో నాలుగు ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమరానికి సిద్ధమైంది. అభ్యర్థులు నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకుని ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించనున్నారు. స్థానికంగా పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో ఓటర్లను



కలుసుకునేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఆయా స్థానాల్లో ఇతర పార్టీల అభ్యర్థుల ఎంపిక, నామినేషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల పోటీపై స్పష్టత రానుంది. స్థానిక రాజకీయ సమీకరణాలు, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు, పార్టీ బలాబలాలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# నరసరావుపేట అంజిరెడ్డి ఆసుపత్రిలో మహిళ మృతి



**- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతురాలి బంధువుల ఆరోపణ.. ఆసుపత్రి ఎదుట ఆందోళన**

**నరసరావుపేట, పెన్ పవర్ అక్టోబర్ 27:**

పల్నాడు జిల్లా నరసరావుపేటలోని అంజిరెడ్డి ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న మహిళ మృతి చెందడం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుటుంబ సభ్యురాలు ప్రాణాలు కోల్పోయిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తూ ఆసుపత్రి ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లికి చెందిన గుంటూరు లక్ష్మీ నారాయణమ్మకు ముక్కులో కండ పెరగడంతో చికిత్స నిమిత్తం గత శనివారం నరసరావుపేటలోని అంజిరెడ్డి ఆసుపత్రికి వచ్చినట్లు సమాచారం. ఆమెకు మంగళవారం శస్త్రచికిత్స నిర్వహిస్తామని వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం ఆసుపత్రి నర్సు లక్ష్మీ నారాయణమ్మకు ఇంజక్షన్ ఇచ్చిన కొద్దిసేపటికే ఆమె మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఇంజక్షన్ ఇచ్చిన వెంటనే ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయిందని, వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఆసుపత్రి ఎదుట బంధువుల ఆందోళన. లక్ష్మీ నారాయణమ్మ మృతితో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, బంధువులు అంజిరెడ్డి ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై మృతురాలి కుమార్తె, కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు ఫిర్యాదును పరిశీలించి, ఘటనకు గల కారణాలను విచారించాల్సి ఉంది. మహిళ మృతికి అసలు కారణం ఏమిటి?.. వైద్యపరమైన నిర్లక్ష్యం జరిగిందా?.. అనే అంశాలు విచారణలో తేలాల్సి ఉంది. అధికారిక విచారణ నివేదిక వెలువడిన తర్వాతే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# బైపాస్‌లో రోడ్డు ప్రమాదం: కారు ఢీకొని యువకుడు మృతి

**చిలకలూరిపేట రూరల్ , పెన్ పవర్, అక్టోబర్ 27 :**

నాదెండ్ల : చిలకలూరిపేట బైపాస్ రోడ్డులో నాదెండ్ల మండల పరిధిలోని పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఒంగోలు నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో వేగంగా వచ్చిన ఓ కారు బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో బైక్‌పై వెళు _న్న వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందాడు.

మృతుడిని చిలకలూరిపేట పట్టణంలోని పోలారెడ్డి పాలెం నివాసి బత్తుల సురేష్‌గా గుర్తించారు. సురేష్ స్థానికంగా బంగారం వ్యాపారంలో పని చేస్తూనే న్యాయశాస్త్రం (లా




కోర్సు) అభ్యసిస్తున్నాడు. యజమాని చెప్పిన పని నిమిత్తం ఎడ్లపాడుకు బంగారం తీసుకోవడానికి బైక్‌పై వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి ఘటనా స్థలం నుంచి పరారయ్యాడు.



సమాచారం అందుకున్న నాదెండ్ల ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలి

**- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు: జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ**

**విజయవాడ,పెన్ పవర్,అక్టోబర్ 27:**

జిల్లాలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ జి.లక్ష్మీశ స్పష్టం చేశారు.

బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించేందుకు సంబంధిత అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరని, ఓటర్లను తరలించేందుకు వాహనాలను వినియోగించడం నేరమని తెలిపారు. లౌడ్ స్పీకర్ల వినియోగానికి ఎన్నికల నిబంధనల ప్రకారం అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ భవనాలపై ప్రచార సామగ్రి ఏర్పాటు చేయరాదని, ప్రైవేట్ స్థలాల్లో ప్రచారం చేయాలంటే యజమానుల అనుమతి పొందాలని సూచించారు. నగదు, మద్యం, బహుమతుల పంపిణీ, ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ప్రతి అభ్యర్థి ఎన్నికల ఖర్చుల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి, రసీదులు భద్రపరచుకోవాలని సూచించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా ఎన్నికల వ్యయ ఖాతాలను సమర్పించాలని, గడువులోగా సమర్పించని వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల నియమావళి, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం-1994ను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా జరిగేందుకు అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు.

# ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ కమిషనర్ కె. మయూర్ అశోక్

**గుంటూరు, పెన్ పవర్,అక్టోబర్ 27:**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా గుంటూరులోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి.ఎం. సాయికాంత్ వర్మ మంగళవారం తనిఖీ చేశారు.

గుంటూరు ఆంధ్రా ముస్లిం కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలని, ఎన్నికల సామగ్రిలో ఎలాంటి కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఎన్నికల సిబ్బందికి అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, రూట్ల వారీగా వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు. సిబ్బంది హాజరును పర్యవేక్షించాలని, ఎన్నికల సామగ్రి స్వీకరణ కేంద్రం వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, మీడియా కేంద్రం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణలో ఎలాంటి ఆలస్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, ఓట్ల లెక్కింపు సజావుగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ తనిఖీల్లో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.



మయూర్ అశోక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి వి. జ్యోతిబసు, ఆర్డీఓ కె. శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



**- ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా చర్యలు చేపట్టాలి మంత్రి అచ్చెన్నాయుడు**

**గుంటూరు : పెన్ పవర్, అక్టోబర్, 27,**

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో ఒక్క ప్రాణనష్టం కూడా జరగకుండా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, వివిధ శాఖల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను సన్నద్ధతపై సమీక్షించారు.వాతావరణ శాఖ అంచనాల ప్రకారం అక్టోబర్ 28న యానాం సమీపంలో తుఫాను తీరం దాటే అవకాశం ఉందని, గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ప్రమాదం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.రైతులు, పంటలు, పశు సంపద రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటలు, కల్లాల్లోని ధాన్యాన్ని భద్రపరచాలని, పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు పశు గ్రాసం, మందులు అందుబాటులో ఉంచాలన్నారు.

మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, చేపలు, రొయ్యల చెరువుల గట్లను పరిశీలించి ఆక్వా రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని, ప్రమాదకర ప్రాంతాల్లో రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు.

తుఫాను ప్రభావం తగ్గిన వెంటనే పంటలు, ఆస్తి నష్టాన్ని అంచనా వేసి సహాయక చర్యలు వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు స్పష్టం చేశారు.

# ఈవీఎం, వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 27,**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు (ఈవీఎం), వీవీప్యాట్ గోదాముకు పటిష్ట భద్రత కల్పించడం జరిగిందని.. అయినప్పటికీ నిరంతర పర్యవేక్షణతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.

భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా సాధారణ నెలవారీ తనిఖీల్లో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం కలెక్టర్ లక్ష్మీశ గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ల గోదామును పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరుతో పాటు అగ్నిమాపక విద్యుత్ పరికరాలను పరిశీలించి అనంతరం పర్యవేక్షణ రిజిస్టర్లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎం, వీవీప్యాట్లను భద్రపరుస్తున్న గోదామును క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎప్పటికప్పుడు సమగ్ర నివేదికను అందించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలోనూ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గోదాము వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ సీసీ కెమెరాల పర్యవేక్షణతో గట్టి నిఘా ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులకు సూచించారు. ఈవీఎం, వీవీప్యాట్ల గోదాము తనిఖీలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహంతో పాటు ఏదుపాటి రామయ్య (తెదేపా), మురళీకృష్ణ (ఐఎన్‌సీ), జడగం శ్రీనివాసరావు (జనసేన పార్టీ), సురేష్ (సీపీఎం) తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి అడుగులోనూ అప్రమత్తంగా ఉండాలి ఎన్నికల వ్యయ జిల్లా పరిశీలకులు బి. విజయ్ కుమార్





**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 27,**

జిల్లాలో స్థానిక ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల వ్యయాల పర్యవేక్షణలో అధికారులు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించాలని ఎన్నికల వ్యయ జిల్లా పరిశీలకులు బి.విజయ్ కుమార్ సూచించారు. ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ, ప్రతి అంశంలోనూ జవాబుదారీతనాన్ని పాటించాలని తెలిపారు.

మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా వ్యయ పరిశీలకులు బి.విజయ్ కుమార్.. సహాయ వ్యయ పరిశీలకులతో పాటు కమాండ్ కంట్రోల్ రూమ్, ఎంసీసీ, ఎంసీఎంసీ, అకౌంటింగ్ టీమ్, ఎక్సైజ్ తదితర విభాగాలు, శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వివిధ కమిటీల పనితీరును పరిశీలించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్స్ (ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్ (ఎస్ఎస్‌టీ), వీడియో సర్వైలెన్స్ టీమ్స్ (వీఎస్‌టీ) తదితర బృందాల మధ్య సమన్వయంపైనా దిశానిర్దేశం చేశారు. ఎన్నికల వ్యయాలకు సంబంధించిన అంశాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, విధుల నిర్వహణలో ప్రతి అడుగులోనూఅప్రమత్తంగాఉండాలనిసూచించారు .సరైనప్రొఫార్మాలో నివేదికల రూపకల్పనతోపాటు వాటిని నిర్దేశ సమయంలోగాసమర్పించాల్సిన అవసరముందన్నారు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, మీడియా ద్వారా ప్రసారమయ్యే ఎన్నికల సంబంధిత ప్రకటనల పర్యవేక్షణ, అభ్యర్థుల వ్యయాల లెక్కల నిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎక్సైజ్ సహా సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలో చేపడుతున్న తనిఖీలు, పర్యవేక్షణ చర్యలను నిరంతరం కొనసాగించాలని, ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే అక్రమ కార్యకలాపాలపై నిఘా ఉంచాలని సూచించారు. ఎన్నికల వ్యయాల పర్యవేక్షణలో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా, అందరికీ ఒకే విధమైన నిబంధనలు వర్తించేలా చర్యలు చేపట్టాలని వ్యయ పరిశీలకులు విజయ్ కుమార్ తెలిపారు.

# గుంటూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది...

# 43వ డివిజన్ కూటమి బిజెపి అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి....

**గుంటూరు, పెన్ పవర్, అక్టోబర్, 27**

రంగావజ్జుల గాయత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోది గారి సహకారంతో ఈరాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గారు ఈరాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తున్నారని తెలిపారు కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 43వ డివిజన్ బ్రాడీపేటలో బిజెపి అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి విస్తృతంగా పర్యటించారు. నగర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై తమ అభిప్రాయాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని రానున్న రోజుల్లో 43వ డివిజన్ ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. నగర అభివృద్ధికి



ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తామని పేర్కొన్నారు. ఈలక్ష్య సాధనకు ప్రజల సహకారం ఎంతో అవసరమని అన్నారు. ఈప్రచార కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు పాటిబండ్ల ఉషారాణి జూపూడి రంగరాజు, యడ్లపాటి రఘునాధ బాబు, యడ్లపాటి స్వరూపరాణి, పాలపాటి రవికుమార్,



రంగావజ్జుల లక్ష్మీపతి, పాటిబండ్ల నారాయణ భరద్వాజ్, హరి పావని, ఉయ్యాల శ్యాంవరప్రసాద్ రాజేష్ నాయుడు, వినోద్ కిరణ్, భూలక్ష్మి, సంధ్య, లక్ష్మయ్య, శ్రీహరి, ఆవుల వెంకటేశ్వరరావు, మోతే శేషగిరి మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# సీఎం సూచలనకు అనుగుణంగా ప్రణాళికాయుత ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 27,**

ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ విపత్కర పరిస్థితుల్లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లోని అర్నబ్ తుపాను కమాండ్ కంట్రోల్ కేంద్రం నుంచి పరిస్థితిని సమీక్షించి సమన్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు 166 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 29, తిరువూరు డివిజన్‌లో 77, నందిగామ డివిజన్‌లో 44, విజయవాడ డివిజన్‌లో 16 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరిస్థితుల తీవ్రత, ప్రజల అవసరాలకు అనుగుణంగా అవసరమైతే మరిన్ని పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు తాగునీరు, ఆహారం, విద్యుత్, పారిశుధ్యం, వైద్య సేవలు తదితర అవసరమైన వసతులతో సన్నద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, దివ్యాంగుల అవసరాలపై ప్రత్యేకంగా దృష్టిసారించినట్లు సూచించారు.

వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే వైద్య సహాయం అందించేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలకు ముందస్తు సమాచారం అందించడం, అప్రమత్తం చేయడం, అవసరమైన సహాయక చర్యలు చేపట్టడంలో అన్ని శాఖల అధికారులు నిమగ్నమయ్యారన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల నుంచి అందే సమాచారంపై తక్షణమే స్పందించేందుకు ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.

అధికారిక సమాచారాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకోండి:తుపాను ప్రభావంతో పెనుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలందరూ



అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. తుపాను సమయంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, అధికారులు సూచించినప్పుడు సమీపంలోని తుపాను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని కోరారు. నదులు, వాగులు, వంకల వైపు వెళ్లకూడదని, నీటి ప్రవాహాలు దాటే ప్రయత్నం చేయరాదన్నారు. ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వదంతులను నమ్మవద్దని, సామాజిక మాధ్యమాల్లో వచ్చే అనధికారిక సమాచారాన్ని విశ్వసించకుండా, అధికారికంగా జారీ చేసే హెచ్చరికలు, సూచనలను మాత్రమే పాటించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

# లయోలా కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ:పెన్ పవర్,అక్టోబర్ 27,**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతను జిల్లా యంత్రాంగం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికలకు సంబంధించి స్థానిక లయోలా కాలేజీలో ఏర్పాటు చేస్తున్న స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాల ఏర్పాట్లను మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ మరియు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ధ్యాన్‌చంద్ర హెచ్.ఎం., ఇతర అధికార యంత్రాంగం కలెక్టర్‌కు ఏర్పాట్ల వివరాలను సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా అధికారులకు కలెక్టర్ కీలక మార్గదర్శకాలు, ఆదేశాలు జారీ చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ పెట్టెలు / ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్టమైన మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 24 గంటల పాటు నిరంతరాయంగా సీసీటీవీ



కెమెరాల నిఘా ఉండేలా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. లెక్కింపు ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా జరిగేలా టేబుళ్ల అమరిక, బారికేడింగ్ పనులను నిబంధనల ప్రకారం చేపట్టాలని సూచించారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, మీడియా ప్రతినిధులకు వేర్వేరుగా మార్గాలు, అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్, నిరంతర విద్యుత్ సరఫరాకు జనరేటర్లు, తాగునీరు, ప్రాథమిక వైద్య సదుపాయాలు సిద్ధం చేయాలన్నారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్



కమిషనర్ ధ్యాన్‌చంద్ర హెచ్.ఎం.ను ఆదేశించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత, నిష్పక్షపాత వాతావరణంలో విజయవంతంగా పూర్తి చేయడానికి అధికార యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ పరిశీలన కార్యక్రమంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్లు, సంబంధిత నోడల్ అధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ

**విజయవాడ, పెన్ పవర్, అక్టోబర్, 27,**

అర్నబ్ తుపాను ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంగళవారం అర్నబ్ తుపాను ప్రభావంపై ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అనంతరం కలెక్టర్ లక్ష్మీశ సమన్వయ శాఖల అధికారులతో మాట్లాడారు. జిల్లా కలెక్టరేట్‌లో 91549 70454 నంబరుతో కంట్రోల్ రూమ్ సేవలందిస్తున్నట్లు తెలిపారు.



అదే విధంగా విజయవాడ డివిజన్ (7569008425), తిరువూరు డివిజన్ (08673-251235), నందిగామ డివిజన్ (7893053534)లోనూ కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మండలస్థాయిలోనూ ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నంబర్లపై అవగాహన కల్పించాలని సూచించారు. తుపాను పరిస్థితులపై నిరంతరం నిఘా ఉంచుతూ, క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ చర్యలు తీసుకునేలా దిశానిర్దేశం చేశారు. వర్షాలు, గాలుల ప్రభావంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామని.. అయినా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే సంబంధిత కమాండ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ తక్షణ స్పందనకు సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు.

# నువ్వా-నేనా అనే రేంజ్‌లో.. బాపట్ల జడ్పీటీసీ..!




**విజయవాడ అక్టోబరు 27, పెన్ పవర్:** బాపట్ల జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల పోరు అత్యంత రసవత్తరంగా మారింది. నామినేషన్ల పర్వం ముగిసిన దరిమిలా.. జిల్లాలో ప్రధాన పార్టీల మధ్య పోటీ తీవ్రస్థాయికి చేరింది. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 3న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు. ప్రస్తుతం బాపట్ల జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్థానం మహిళ (జనరల్) కేటగిరీకి రిజర్వ్ అయింది. తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులు జిల్లా వ్యాప్తంగా ఉమ్మడిగా రంగంలోకి దిగారు.

మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో అభ్యర్థుల గెలుపు కోసం ముమ్మరంగా సమీక్షలు, ప్రచారాలు నిర్వహిస్తున్నారు. గత 2021 పరిషత్ ఎన్నికల్లో నాటి గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలోని బాపట్ల మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఏకపక్ష విజయం సాధించింది. ఈసారి కూడా స్థానిక పట్టును నిలుపుకోవాలని మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి వంటి కీలక నేతల ఆధ్వర్యంలో పార్టీ గట్టి పోటీని ఇస్తోంది. ఇక, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి వంటి స్థానాల్లో వైఎస్ షర్మిల నాయకత్వంలోని కాంగ్రెస్ అభ్యర్థులు కూడా నామినేషన్లు వేసి త్రిముఖ పోరుకు ప్రయత్నిస్తున్నారు.

నామినేషన్ల ప్రక్రియలో ప్రధానంగా టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిలో సీట్ల సర్దుబాటు కుదిరినప్పటికీ, ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో కొన్ని స్థానాల్లో రెబల్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరిని బుజ్జగించేం దుకు కూటమి నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారురు, రెబల్స్ బరిలో ఉంటే అధికారిక అభ్యర్థుల ఓట్లకు గండిపడే ప్రమాదం ఉంది. అయితే.. కొందరు వెనక్కి తగ్గినా.. మరింత మంది మాత్రం ఇంకా కొనసాగుతున్నారు. దీంతో వారిని బుజ్జగించేందుకు మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావులు ప్రయత్నాలు చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు స్థానిక అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు వివిధ మార్గాలను అన్వే షిస్తున్నారు. ఎన్నికల నియమావళి ప్రకారం అభ్యర్థులు పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లకూడదని ఆంక్షలు విధిం చినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఒప్పందాలు, రాయబారాలు జోరుగా సాగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా టీడీపీ, వైసీపీల్లో తటస్థ ఓటరును ఆకట్టుకునేందుకు ప్రయత్నాలుముమ్మరంగా సాగుతున్నాయి. అయితే.. ఎవరి ధీమా వారిదే అన్నట్టుగా కనిపిస్తోంది. ఎవరూ వెనక్కి తగ్గకుండా ప్రచార పర్వంలో దూసుకుపోతున్నారు

# తాడోపేడో తేల్చుకునేలా జగన్..

## పులివెందుల పరిణామాలతో తీవ్ర నిర్ణయం!

**విజయవాడ అక్టోబరు 27, పెన్ పవర్:** స్థానిక ఎన్నికల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ రెడ్డి గట్టి నిర్ణయం తీసుకున్నారా? తన సొంత నియోజకవర్గం, దశాబ్దాలుగా వైఎస్ కంచుకోటగా ఉన్న పులివెందులలో పార్టీ అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారా? అంటే ఔను అన్న సమాధానమే లభిస్తోంది. పులివెందులలో పరిస్థితిని స్వయంగా తెలుసుకునేందుకు మంగళవారం వచ్చిన జగన్ రెడ్డి కూటమి ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకోవాలనే నిర్ణయానికి వచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఎన్నికల రోజు తాను పులివెందుల వస్తానని, ఎవరు వస్తారో రమ్మంటూ సవాల్ చేశారని అంటున్నారు.రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వేడి రోజురోజుకు వేడెక్కుతోంది. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో ప్రతిపక్షం వైసీపీకి ఏమాత్రం అనుకూలమైన పరిస్థితులు లేకపోవడాన్ని ఆ పార్టీ తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వాన్ని ఢీకొట్టడానికి ఎంతవరకైనా వెళ్లాలని నిర్ణయం తీసుకుందని అంటున్నారు. మంగళవారం పులివెందుల నియోజకవర్గంలో పర్యటించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఈ దిశగా సంకేతాలిచ్చారని అంటున్నారు. పులివెందులలో సౌండ్ చేస్తే, రాష్ట్రమంతా మోగాలి. ప్రభుత్వం తుడిచిపెట్టుకుపోవాలని కేడర్ కు పిలుపునిచ్చిన మాజీ సీఎం.. తన వాళ్లు (వైసీపీ కార్యకర్తలు)పై చేయి వేస్తే తనపై వేసినట్లేనని గుర్తించుకోవాలని పోలీసులకు వార్నింగ్ ఇచ్చారు.మాజీ సీఎం జగన్మోహనరెడ్డి వ్యాఖ్యలు బట్టి చూస్తే మున్సిపల్ ఎన్నికల్లో చావోరేవో తేల్చుకోవాలని వైసీపీ నిర్ణయించుకున్నట్లుగా భావిస్తున్నారు. పులివెందులలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన జగన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నామినేషన్లు అడ్డుకున్నారని, మహిళలపై దాడులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యకర్తలు



రెండేళ్లు ఓపిక పట్టాలని, వచ్చేది జగన్ ప్రభుత్వమే అంటూ భరోసా ఇచ్చారు. జగన్ 2.0 ప్రభుత్వంలో కార్యకర్తలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం కూటమికి అనుకూలంగా పనిచేసిన అధికారులు అందరిపైనా చర్యలు తీసుకుంటాం, రిటైర్ అయినా వదిలిపెట్టమని హెచ్చరించారు. మొత్తానికి పులివెందులలో సగానికి పైగా వార్డులు ఏకగ్రీవం అవడాన్ని మాజీ సీఎం జగన్ రెడ్డి జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. నామినేషన్లు వేయడానికి పార్టీ అభ్యర్థులు ఉన్నప్పటికి బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకున్నారని జగన్ రెడ్డి అభిప్రాయపడుతున్నారు. దీంతో పులివెందుల మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికలో తమ సత్తా ఏంటో చూపాలని భావిస్తున్నారని అంటున్నారు. పులివెందుల మున్సిపాలిటీ చైర్ పర్సన్ అభ్యర్థిగా జగన్ రెడ్డి పిన్ని లలితమ్మ పోటీ చేస్తున్నారు. దీంతో ఆమెను ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అంటున్నారు. ఆ కారణంగా తానే స్వయంగా రంగంలో దిగాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. పోలింగ్ రోజు పులివెందుల వస్తానని, ఓటు వేస్తానని చెబుతున్న మాజీ సీఎం జగన్ రెడ్డి ఆ రోజు పోలీసులు దుందుడుకు చర్యలకు పాల్పడకూడదని ముందే వార్నింగ్ ఇచ్చారని అంటున్నారు. దీంతో పులివెందుల రాజకీయాలు హైటెన్షన్ గా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# కాకినాడకు GD 10 అలర్ట్.. అసలేంటి హెచ్చరిక

**విజయవాడ అక్టోబరు 27, పెన్ పవర్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అతి తీవ్ర తుఫాన్ అర్నబ్ ఆంధ్రప్రదేశ్ ను వణికిస్తోంది. ఇంతకు ముందు ఎన్నడూ లేనివిధంగా కోస్తా తీరంలోని కాకినాడ పోర్టులో 10వ నంబరు హెచ్చరిక జారీ చేశారు. దీనిని గ్రేట్ డేంజర్ సిగ్నల్ 10గా పరిగణిస్తున్నారు. సహజంగా తుపాను హెచ్చరికలు 1 నుంచి మొదలుపెడతారు. ఒకటో నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేసినప్పుడు అప్రమత్తం అవ్వాలని హెచ్చరించినట్లుగా భావించాలని నిపుణులు చెబుతున్నారు. ఒకటి నుంచి నెంబరు పెరుగుతున్న కొద్ది ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉన్నట్లుగా భావించాలి. ఇలా 11వ నంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే పరిస్థితి పూర్తిగా చేయిదాటినట్లుగా భావించాలని అంటున్నారు.

అయితే ఇప్పుడు ఏపీలో కాకినాడ పోర్టుకు 10వ నంబరు హెచ్చరిక, విశాఖపట్నం, గంగవరం పోర్టులకు 9వ నెంబరు హెచ్చరిక జారీ చేయడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. తుఫాన్ తీరానికి సమీపించిన కొద్ది మరింత భయం ఎక్కువవుతోంది. దీంతో ప్రభుత్వం కూడా అత్యంత అప్రమత్తమైందని అంటున్నారు. సముద్రంలో తుఫానులు, తీవ్ర వాయుగుండాలు ఏర్పడినప్పుడు తీరప్రాంత ప్రజలను, ఓడరేవులు, మత్స్యకారులను అప్రమత్తం చేయడానికి భారత వాతావరణ శాఖ (×వీణ) ఈ ప్రమాద హెచ్చరికలను జారీ చేస్తుంది. 1 నుంచి 11 నెంబర్ల వరకు ఉన్న ప్రమాద హెచ్చరికల ఉద్దేశం ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం..

**1వ నంబరు ప్రమాద హెచ్చరిక - దూరంగా ముప్పు**

సముద్రంలో గాలి వేగంతో కూడిన గాలులు వీస్తున్నాయని, వాయుగుండం ఏర్పడే సంకేతాలు ఉన్నాయని 1వ నంబరు ప్రమాద హెచ్చరిక తెలియజేస్తుంది. అయితే ఈ ప్రభావం పోర్టుకు చాలా దూరంలో ఉంటుంది. దీనివల్ల ఓడ రేవులు, తీరప్రాంతాలకు తక్షణ ప్రమాదమేమీ ఉండదు కానీ, వాతావరణంలో మార్పులు మొదలయ్యాయని అర్థం చేసుకోవాల్సివుంటుంది.

**2వ నంబరు - దూరంగా తీవ్ర ముప్పు**

సముద్రంలో ఏర్పడిన అల్పపీడనం లేదా వాయుగుండం తుఫానుగా మారినప్పుడు ఈ హెచ్చరికను జారీ చేస్తారు. తుఫాను ఇంకా ఓడరేవుకు దూరంగానే ఉన్నప్పటికీ, సముద్రంలో ప్రయాణించే నౌకలకు కొత్తగా ఓడరేవును విడిచి వెళ్లే ఓడలకు ముందస్తు సమాచారం అందించడం దీని ముఖ్య ఉద్దేశంగా చెబుతున్నారు.

**3వ నంబరు - స్థానికంగా ముప్పు**

తుఫాను కారణంగా ఓడరేవు పరిసర ప్రాంతాల్లో వాతావరణం అల్లకల్లోలంగా మారే అవకాశం ఉన్నప్పుడు ఈ సంకేతాన్ని ఇస్తారు. స్థానికంగా ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని, రేవులోని చిన్న ఓడలు, పడవలు అప్రమత్తంగా ఉండాలని ఇది హెచ్చరిస్తుంది.

**4వ నంబరు - స్థానిక ప్రమాదం**

సముద్రంలో తుఫాను తీవ్రమై, సదరు ఓడరేవుపై నేరుగా ప్రభావం చూపబోతోందని 4వ నంబరు హెచ్చరిక సూచిస్తుంది. అయితే ఈ తుఫాను ఇంకా తీరం దాటే పరిస్థితికి వచ్చిందా లేదా అనేది స్పష్టత లేని సమయంలో, రేవులోని నౌకలు అత్యంత అప్రమత్తంగా ఉండటానికి ఈ సిగ్నల్ ఎగురవేస్తారు.

**5వ నంబరు - ఎడమ వైపు తీరం దాటే ప్రమాదం**

సాధారణ తుఫాను తీరాన్ని సమీపించి, సదరు ఓడరేవుకు ఎడమ వైపున తీరం దాటే అవకాశం ఉన్నప్పుడు 5వ నంబరు హెచ్చరికను జారీ చేస్తారు. దీనివల్ల ఆ పోర్టు ప్రాంతంలో బలమైన ఈదురు గాలులు, భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉంటుంది.

**6వ నంబరు కుడి వైపు తీరం దాటే ప్రమాదం**

సాధారణ తుఫాను సదరు ఓడరేవుకు కుడి వైపున తీరం దాటబోతోందని ఈ హెచ్చరిక సూచిస్తుంది. 5వ నంబరు లాగే ఇది కూడా తీవ్రమైన గాలి, వర్షాల ప్రమాదాన్ని సూచిస్తుంది, కాకపోతే తుఫాను దిశ పోర్టుకు కుడివైపుగా ఉంటుంది.

**7వ నంబరు - నేరుగా ప్రమాదం**

తుఫాను సదరు ఓడరేవుకు అత్యంత సమీపంలో లేదా నేరుగా ఆ పోర్టు మీదుగానే తీరం దాటే అవకాశం ఉన్నప్పుడు 7వ నంబరు ప్రమాద హెచ్చరికను ఇస్తారు. ఈ సమయంలో ఓడరేవు పరిసరాల్లో భారీ నష్టం జరిగే అవకాశం ఉన్నందున అత్యంత అప్రమత్తత అవసరం.

8వ నంబరు - ఎడమ వైపు తీవ్ర తుఫాను

ఇది "గ్రేట్ డేంజర్" (తీవ్ర ప్రమాదం) కేటగిరీకి చెందుతుంది. అతి తీవ్రమైన తుఫాను ఆ ఓడరేవుకు ఎడమ వైపున తీరం దాటబోతోందని 8వ నంబరు హెచ్చరిక చెబుతుంది. ఈ సమయంలో గంటకు 100 కిలోమీటర్లకు పైగా వేగంతో ఈదురుగాలులు వీస్తాయని చెబుతున్నారు. తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం సంభవించే ముప్పు ఉండే సమయంలో 8వ నంబరు హెచ్చరిక జారీ చేస్తారు.

**9వ నంబరు కుడి వైపు తీవ్ర తుఫాను**

అత్యంత బలమైన తీవ్రమైన తుఫాను ఓడరేవుకు కుడి వైపున తీరం దాటే అవకాశం ఉన్నప్పుడు 9వ నంబరు హెచ్చరిక జారీ చేస్తారు. ఇది సముద్రం ఉప్పొంగడం, వినాశకరమైన గాలులు వీచడం వంటి తీవ్ర ముప్పును సూచిస్తుంది.

**10వ నంబరు - అత్యంత వినాశకర ప్రమాదం**

అత్యంత తీవ్రమైన తుఫాను సదరు ఓడరేవు మీదుగా లేదా దానికి అత్యంత సమీపంలో తీరం దాటబోతోందని 10వ నంబరు ప్రమాద హెచ్చరిక (+ఐ10) సూచిస్తుంది. ఇది అత్యంత ప్రాణాంతకమైన పరిస్థితి. రాక్షస అలలు, అత్యంత తీవ్ర వేగంతో కూడిన గాలులు వీస్తాయి. రేవు కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేసి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. ప్రస్తుతం కాకినాడ పోర్టుకు ఈ హెచ్చరికే జారీ అయింది.

**11వ నంబరు - సమాచార వ్యవస్థ వైఫల్యం**

వాతావరణ కేంద్రంతో ఓడరేవుకు ఉన్న టెలికమ్యూనికేషన్, రేడియో లేదా అన్ని రకాల సమాచార వ్యవస్థలు పూర్తిగా విచ్ఛిన్నమైనప్పుడు ఈ చివరి హెచ్చరికను ఎగురవేస్తారు. తుఫాను అత్యంత వినాశకరంగా మారినప్పుడు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయినప్పుడు అత్యంత తీవ్ర అత్యవసర పరిస్థితిని సూచించడానికి దీనిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం అర్నబ్ తుఫాను ఈ ప్రమాద హెచ్చరికకు దగ్గరగా భయపెడుతోందని అంటున్నారు. దీంతో ప్రభుత్వం ప్రతి గంటకు పరిస్థితిని సమీక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోందని అంటున్నారు.

ముఖ్యమైన విషయం: ఈ హెచ్చరికలు ప్రధానంగా ఓడరేవుల్లో నౌకాయాన భద్రత కోసం ఉపయోగిస్తారు. వీటిని ప్రజల కోసం జారీ చేసే సాధారణ వాతావరణ హెచ్చరికలతో కలపకూడదు. అలాగే ప్రతి నంబరు ప్రమాద తీవ్రతను మాత్రమే వరుసగా పెంచుతుందని భావించకూడదు; కొన్ని సంకేతాలు తుఫాను దిశ, పోర్టుతో దాని సంబంధాన్ని సూచిస్తాయి. ప్రస్తుత హెచ్చరికల కోసం భారత వాతావరణ శాఖ (×వీణ), సంబంధిత పోర్టు అధికారుల అధికారిక ప్రకటనలను పరిశీలించాలి.

# టీడీపీలో చేరిపోయిన పేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి !

**గుంటూరు, అక్టోబరు 27, పెన్ పవర్:** పల్నాడు రాజకీయాల్లో మాజీ మంత్రి విడదల రజిని రాజకీయం నవ్వులపాలైంది. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల వేళ.. పోలీసులు తనను కింద పడేశారని, అడ్డుకున్నారని ఒక పెద్ద సెంటిమెంట్ డ్రామాకు తెరతీసిన ఆమె, ఇంట్లోనే కూర్చుని పరామర్శల రాజకీయం చేస్తున్నారు. సానుభూతి పొందేందుకు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలందరినీ తన వద్దకు పరామర్శలకు పిలిపించుకుంటూ లైవ్ కవరేజీలతో రచ్చ చేశారు. అయితే రజిని ఈ పరామర్శల పర్వంలో మునిగి తేలుతున్న సమయంలోనే, క్షేత్రస్థాయిలో పార్టీకి జరగాల్సిన అసలు నష్టం జరిగిపోయింది. విడదల రజిని ఒకవైపు సెంటిమెంట్ పొలిటికల్ గేమ్ ఆడుతుంటే,మరొకవైపు ఆమె ఎంతో నమ్మకంగా బరిలో నిలిపిన అభ్యర్థులే ఇదే సందు అనుకుని సైలెంట్‌గా గోడ దూకేశారు. చిలకలూరిపేట మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా రజిని ప్రతిపాదించిన కరీమూన్ ఏకంగా వైఎస్సార్‌సీపీకి హ్యాండ్ ఇచ్చి తెలుగుదేశం పార్టీ కండువా కప్పేసుకున్నారు. అంతేకాకుండా, టిడిపి అభ్యర్థి గెలుపు కోసం స్వయంగా ప్రచారంలోకి దిగడం వైఎస్సార్‌సీపీ శ్రేణులను కోలుకోలేని దెబ్బతీసింది.మున్సిపల్ ఎన్నికల్లో కరీమూన్‌తో నామినేషన్ వేయించడం, అది ఉపసంహరణ కాకుండా చూసుకోవడం వరకే విడదల రజిని శ్రద్ధ చూపించారు. కానీ, సదరు నాయకురాలు తమ వైపే ఉందా లేదా, క్షేత్రస్థాయిలో పార్టీకి విధేయంగా ఉందా అనే విషయాన్ని గమనించడంలో రజిని ఘోరంగా విఫలమయ్యారు. పోటీ నుంచి ఉపసంహరించుకోకుండా జాగ్రత్తపడిన రజిని, కరీమూన్ టిడిపిలోకి క్యూ కట్టకుండా మాత్రం ఆపలేకపోయారు. దీంతో వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేర్చడంలో ఆమె అసమర్థత మరోసారి బయటపడింది.పోలీసులతో వివాదాన్ని ఆసరాగా చేసుకుని విక్టిమ్ కార్డ్ ఉపయోగించి రాజకీయ లబ్ధి పొందాలనుకున్న విడదల రజిని వ్యూహం తుస్సుమంది. ఒకవైపు తాను ఇంట్లో కూర్చుని సెంటిమెంట్ డ్రామాలతో కాలక్షేపం చేస్తుంటే, తన చేతుల మీదుగా టికెట్ పొందిన కీలక అభ్యర్థే ప్రత్యర్థి కూటమిలో చేరి ప్రచారం చేసుకోవడం రజిని రాజకీయ భవిష్యత్తు దెబ్బీసింది. సొంత నియోజకవర్గంలోనే అభ్యర్థులను కాపాడుకోలేని నాయకురాలు రాష్ట్రస్థాయిలో వైఎస్సార్‌సీపీని ఏం నడిపిస్తుందంటూ సొంత పార్టీ కేడరే పెదవి విరుస్తోంది

**ఒంగోలులో ఎన్నికల బరిలో జెన్ జీ.**

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల నగరా మోగిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ముందుగా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్నారు. నవంబర్ 1న 100 అర్బన్ లోకల్ బాడీల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా.. అభ్యర్థులు ప్రచారంలో నిమగ్నం అయ్యారు. స్థానిక ఎన్నికల్లో పోటీకి జెన్ జీ యువత కూడా ఆసక్తి కనబరుస్తోంది. ఒంగోలులో 24 ఏళ్ల చావలి చర్విత కార్పొరేటర్‌గా పోటీ చేస్తున్నారు.ఎంటెక్ చదివిన చర్విత ఉద్యోగం చేసుకొందామని భావించకుండా.. రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఒంగోలు 27వ డివిజన్ నుంచి కూటమి తరఫున టీడీపీ అభ్యర్థిగా ఆమె నామినేషన్ దాఖలు చేశారు. ఈ డివిజన్ బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో.. యాదవ సామాజికవర్గానికి చెందిన ఆమె బరిలో నిలిచారు. ఆమె ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువుకున్నారు.తమది రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం అన్న చర్విత.. తన తాతయ్య చావలి కృష్ణయ్య గతంలో కౌన్సిలర్‌గా పని చేశారన్నారు. తమ కుటుంబానికి టీడీపీతో 40 ఏళ్లకుపైగా అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తేళ్లకుల అనంతమ్మ ప్రస్తుతం అన్నవరం దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా పని చేస్తున్నారన్నారు. వీళ్ల స్ఫూర్తితోనే తాను చదువు పూర్తయ్యాక రాజకీయాల్లోకి అడుగుపెట్టానన్నారు. తనకు టికెట్ రావడానికి ఎమ్మెల్యే దామరచర్ల జనార్ధన్ కారణమని చర్విత చెప్పారు. 27వ డివిజన్‌ను ఒంగోలులోనే ది బెస్ట్ డివిజన్‌గా నిలుపుతానన్నారు. ప్రజలకు ఏం చేస్తే బాగుంటుందనేది తాను నిత్యం ఆలోచిస్తుంటానన్నారు.ప్రస్తుతం మున్సిపల్ ఎన్నికల్లో ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా టీడీపీకి చెందిన నల్లమిల్లి శ్రీశిల్ప బరిలోకి దిగారు. వైసీపీ తరఫున ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ బరిలో ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ఇండిపెండెంట్ మేయర్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయగా.. ఆయన నామినేషన్ తిరస్కరణకు గురైంది. అధికారుల తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఎన్నికల బరిలో నుంచి తన పేరును తొలగించారని, తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించకపోతే న్యాయపోరాటానికి దిగుతానని ఆయన హెచ్చరించారు.2021లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఒంగోలు కార్పొరేషన్‌ను వైసీపీ గెలుచుకుంది. వైసీపీ 41, టీడీపీ 6, జనసేన 1, స్వతంత్రులు రెండు స్థానాల్లో గెలిచారు. అయితే 2024 ఎన్నికల తర్వాత ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో మేయర్, డిప్యూటీ మేయర్ సహా 17 మంది కార్పొరేటర్లు టీడీపీలో చేరారు. దీంతో ఈ కార్పొరేషన్ టీడీపీ వశమైంది.

# వైసీపీ అభ్యర్థులకు ఆర్థికకష్టాలు

**కర్నూలు, అక్టోబరు 27, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైన నాటి నుంచీ కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం వైఖరి, ఇప్పుడు క్షేత్రస్థాయి క్యాడర్‌ను తీవ్ర గందరగో ళంలోకి నెట్టేసింది. "రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిపోతోంది, తమ అభ్యర్థులను నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ గవర్నర్‌కు ఫిర్యాదులు, మీడియా ముందు ప్రెస్‌మీట్లతో నానా హంగామా సృష్టించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి.. తీరా ఎన్నికల రణక్షేత్రం వేడెక్కుతున్న తరుణంలో యథావిధిగా బెంగళూరు ప్యాలెస్‌కు వెళ్లిపోయారు. అధినేత చేసిన ఆరోపణలకు పూర్తి భిన్నంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 90 శాతానికి పైగా స్థానాల్లో వైసీపీ అభ్యర్థులు యథేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయడం, ఒకవైపు అసత్య ప్రచారాన్ని బట్టబయలు చేస్తూనే, మరోవైపు నాయకత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది.స్థానిక ఎన్నికల్లో ఎవరైనా ప్రత్యర్థులకు స్థానాలు ఏకగ్రీవం చేస్తే, భవిష్యత్ అసెంబ్లీ , సార్వత్రిక ఎన్నికల్లో వారికి ఎట్టిపరిస్థితుల్లోనూ పార్టీ టికెట్లు ఇచ్చేది లేదని జగన్ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తమ రాజకీయ భవిష్యత్తును కాపాడుకునేందుకు కొందరు, మరికొందరు స్థానిక టీడీపీ నేతలతో తెరవెనుక చర్చలు జరిపి వ్యక్తిగత ప్రయోజనాలు , హామీలు పొందే వ్యూహంతో నామినేషన్లు వేయించినట్లు స్పష్టమవుతోంది. నామినేషన్ల సంఖ్య భారీగానే కనిపించినప్పటికీ, అందులో ప్రజాబలంతో పాటు అంతర్గత బేరసారాల వ్యూహాలే ఎక్కువ పాత్ర పోషించాయన్న వాదన బలంగా వినిపిస్తోంది.నామినేషన్లు వేయడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత సీరియస్‌గా బరిలో నిలబడి ప్రజల్లోకి వెళ్లాలనుకున్న అసలైన క్యాడర్ పరిస్థితి మాత్రం దయనీయంగా మారిపోయింది. పోరుబాట పట్టిన అభ్యర్థులను వెనకుండి నడిపించే నాథుడే కరువయ్యారు. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ అనుభవించి, కోట్లాది రూపాయల పదవులు అనుభవించిన జిల్లా స్థాయి ముఖ్య నేతలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ఇప్పుడు ముఖం చాటేశారు. తమ సొంత ఇలాకాల్లో సైతం ఎన్నికల ఖర్చులకు రూపాయి విదల్చకుండా చేతులెత్తేశారు. కనీసం బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవడానికి, రోజువారీ ప్రచార రథాలు, కరపత్రాల ముద్రణకు కూడా జిల్లా నాయకత్వం నుంచి నయాపైసా ఆర్థిక సాయం అందకపోవడంతో క్షేత్రస్థాయి నాయకులు దిక్కుతోచని స్థితిలో ఒంటరి పోరాటం చేయాల్సి వస్తోంది.ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక నగరాలైన విజయవాడ, విశాఖపట్నం, కడప వంటి మున్సిపల్ కార్పొరేషన్లలో పార్టీ తరఫున మేయర్ రేసులో నిలిచిన అభ్యర్థుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కార్పొరేషన్ స్థాయి ప్రచారం అంటే లక్షల్లో, కోట్లల్లో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఆర్థికంగా దెబ్బతిన్న అభ్యర్థులు సొంత జేబుల్లోంచి నిధులు పెట్టే సాహసం చేయలేకపోతున్నారు. అటు పార్టీ పెద్దల నుంచి ఎటువంటి చేయూత లభించడం లేదు. దీనితో వీధుల్లో నామమాత్రపు మైకులతో తిరుగుతూ ప్రచారం చేస్తున్నామా లేదా అన్నట్లుగా కాలం వెళ్లదీస్తున్నారు. అధిష్ఠానం బెంగళూరులో కూర్చుని సోషల్ మీడియా ట్వీట్లతో సరిపెడుతుంటే, క్షేత్రస్థాయిలో తాము ఎందుకు బలపడాలన్న అసహనం అభ్యర్థుల్లో పెల్లుబుకుతోంది.ఈ ఆర్థిక స్తోమత లేమి, నాయకత్వపు అలసత్వం వెరసి చివరికి చాలా చోట్ల వైసీపీ అభ్యర్థులు అధికార కూటమి నేతలతో లాలూచీ పడే దిశగా అడుగులు వేయిస్తోంది. గెలిచే అవకాశాలు లేనప్పుడు సొంత ఆస్తులు అమ్ముకుని ఎన్నికల్లో తగలబెట్టడం కంటే.. అధికార పక్షంతో ఏదో ఒక రూపంలో సర్దుబాటు చేసుకుని నిశ్శబ్దంగా ఉండటమే శ్రేయస్కరమని పలువురు కౌన్సిలర్, కార్పొరేటర్ అభ్యర్థులు నిర్ణయించుకుంటున్నారు. ఎన్నికలను కేవలం రాజకీయ ప్రతీకార ప్రకటనలకే పరిమితం చేసి, పోరాడే సైనికులకు కవచాన్ని, ఆయుధాలను అందించని అధిష్ఠాన వైఖరి వల్లే ఈ పరిస్థితి దాపురించింది.




- **కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం**
- **యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు**
- **పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్**
- **ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా**
- **భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు**

న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో

భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు.

ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ

పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

# ఇలాంటి బ్యాటింగ్ ఎప్పుడూ చూడలేదన్న అయ్యర్.. వాళ్లను ఆపడం కష్టమన్న శాంట్నర్



న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా చారిత్రక విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీలపై ప్రశంసల వర్షం కురుస్తోంది. ఇరు జట్ల కెప్టెన్లు వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ముఖ్యంగా భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రత్యర్థి సారథి మిచెల్ శాంట్నర్ ఆ ఇద్దరినీ ఆకాశానికెత్తేశారు.

ఈ అద్భుత ప్రదర్శనపై మ్యాచ్ అనంతరం శ్రేయస్ అయ్యర్ స్పందిస్తూ.. "నిజంగా అద్భుతం. వారిద్దరూ ఆడిన షాట్లు కళ్లకు చాలా ఇంపుగా అనిపించాయి. నేను, సంజు బ్యాటింగ్‌కు వెళ్లినప్పుడు బంతి సీమ్ అవుతోంది. వాళ్లిద్దరూ ఇలాంటి పిచ్‌పై అంత సులువుగా ఎలా ఆడగలిగారని ఆశ్చర్యపోయాను. ఇది నమ్మశక్యం కాని విషయం" అని అన్నాడు. అంతర్జాతీయ స్థాయిలో ఇలాంటి బ్యాటింగ్ చూడటం ఇదే మొదటిసారని, ఐదు ఓవర్లలోనే 100 పరుగులు చేయడం ఎప్పుడూ చూడలేదని అయ్యర్ కొనియాడాడు. వారి ప్రదర్శన అన్నింటికంటే అత్యుత్తమమని ప్రశంసించాడు. మరోవైపు, న్యూజిలాండ్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కూడా భారత ఓపెనర్ల బ్యాటింగ్‌కు ఫిదా అయ్యాడు. "వాళ్లు అలా చెలరేగి ఆడుతుంటే ఆపడం చాలా కష్టం. వారి విధ్వంసకర బ్యాటింగ్‌ను గతంలో ఐపీఎల్‌లో చూశాం. ఇప్పుడు మా దేశంలో ప్రత్యక్షంగా చూశాం. పవర్‌ప్లేలో ఎలా బ్యాటింగ్ చేయాలో వాళ్లు నిరూపించారు" అని శాంట్నర్ వ్యాఖ్యానించారు. మంగళవారం వెల్లింగ్టన్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ (113), వైభవ్ సూర్యవంశీ (45) తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. పవర్‌ప్లేలో రికార్డు స్థాయిలో 118 పరుగులు సాధించి భారత భారీ విజయంలో ప్రధాన భూమిక పోషించారు.

# సార్.. తమరు అద్భుతంగా ఆడారు: శిష్యుడి సెంచరీపై యువీ కామెంట్



తన శిష్యుడు అభిషేక్ శర్మ న్యూజిలాండ్‌పై రికార్డు శతకంతో చెలరేగిన వేళ, భారత మాజీ డాషింగ్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ సోషల్ మీడియా వేదికగా ఆసక్తికరంగా స్పందించాడు. ఒకవైపు తన రికార్డును గుర్తుచేస్తూ సరదాగా ఆటపట్టిస్తూనే, మరోవైపు శిష్యుడి అద్భుత ప్రదర్శనను మనసారా ప్రశంసించాడు. ఈ గురుశిష్యుల మధ్య జరిగిన సంభాషణ ఇప్పుడు క్రీడాభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20 మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 15 బంతుల్లో హాఫ్ సెంచరీ, 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసి న్యూజిలాండ్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. మరో యువ కెరటం వైభవ్ సూర్యవంశీ (18 బంతుల్లో 45)తో కలిసి జట్టుకు అద్భుత ఆరంభాన్నిచ్చాడు. వీరిద్దరి ధాటికి భారత్ కేవలం 5 ఓవర్లలోనే 100 పరుగులు చేసి రికార్డు సృష్టించింది. ఈ అద్భుత ఇన్నింగ్స్ అనంతరం అభిషేక్ తనదైన శైలిలో 'మెడిటేషన్'తో సెలబ్రేట్ చేసుకున్నాడు. అభిషేక్ ఇన్నింగ్స్ అనంతరం సోషల్ మీడియా వేదికగా స్పందించిన యువరాజ్ సింగ్, తొలుత సరదాగా టీజ్ చేశాడు. "నువ్వు 12 బంతుల్లో 50 పరుగులు ఇంకా చేయలేదు!" అంటూ 2007 టీ20 ప్రపంచకప్‌లో

తన రికార్డును గుర్తు చేశాడు. అందుకు అభిషేక్ శర్మ స్పందిస్తూ... "అలాంటి ఫీట్లు (12 బంతుల్లో 50) చేయడం అంత సులభం కాదు.. ఇలాంటివి ఎప్పుడో కానీ సాధ్యం కావు... అన్ని వేళలా అలా ఆడాలంటే కష్టం" అని వినమ్రంగా చెప్పాడు. అయితే, వెంటనే మరో ట్వీట్‌లో యువీ తన శిష్యుడిపై ప్రశంసల వర్షం కురిపించాడు. "నేను 30-34 బంతుల్లో 100 పరుగులు చేయలేను. సార్, మీరు అద్భుతంగా ఆడారు! గొప్ప ఇన్నింగ్స్. సెంచరీ సాధించే క్రమంలో తమరు సింగిల్స్ కూడా తీశారు" అంటూ ఫన్నీ కామెంట్స్ చేశాడు. అంతేకాదు, యువీ ఇతర ఆటగాళ్లపైనా తన స్పందన తెలియజేశాడు. మరో ఎండ్‌లో వైభవ్ సూర్యవంశీ కూడా అదరగొట్టాడని కొనియాడాడు. సంజూ శాంసన్ జట్టు కోసం మూడో స్థానంలో ఆడటం గొప్ప విషయం అని అభినందించాడు. "200 లోపు స్కోరుకు ప్రత్యర్థిని కట్టడి చేసిన మన బౌలర్లకు అభినందనలు. అద్భుత సిరీస్ విజయం" అంటూ టీమిండియాపై ప్రశంసల జల్లు కురిపించాడు.

# అజ్ఞాతవాసి దెబ్బ.. మళ్లీ అలా ఎందుకు చేస్తారు?



మాలవికా మోహనన్ పండుగ వేళ ధరించిన దుస్తుల్లో కాలాతీతమైన సాంప్రదాయ సొగసు వెల్లివిరిసింది



ఒకసారి ఎదురైన చేదు అనుభవాన్ని అంత త్వరగా మర్చిపోవడం ఎవరికైనా కష్టమే. ముఖ్యంగా వందల కోట్ల బిజినెస్ జరిగే సినిమా విషయంలో పొరపాటు జరిగితే దాని ప్రభావం చాలా కాలం ఉంటుంది. దర్శకుడు త్రివిక్రమ్ కూడా గతంలో అలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నారు. ఇప్పుడు వెంకటేష్‌తో తీసిన 'ఆదర్శ కుటుంబం'పై కాపీ ప్రచారం మొదలవడంతో ఎనిమిదేళ్ల క్రితం జరిగిన ఓ వివాదం మళ్లీ గుర్తుకొస్తోంది. అయితే అప్పట్లో ఎదురైన దెబ్బ తర్వాత త్రివిక్రమ్ మళ్లీ అదే తరహా రిస్క్ తీసుకుంటారా అనేది ఆలోచించాల్సిన విషయం. 2018లో పవన్ కళ్యాణ్‌తో త్రివిక్రమ్ తెరకెక్కించిన 'అజ్ఞాతవాసి' విడుదలకు ముందే కాపీ ఆరోపణలు ఎదుర్కొంది. ఫ్రెంచ్ సినిమా 'లార్గో వించ్' కథను పోలి ఉందంటూ అప్పట్లో పెద్ద వివాదమే నడిచింది. ఆ సినిమా రీమేక్ హక్కులు కలిగిన టీ సిరీస్‌తో కాపీరైట్ వ్యవహారం కూడా తెరపైకి వచ్చింది. చివరకు ఆ సమస్యను పరిష్కరించుకున్నట్లు వార్తలు వచ్చాయి. కానీ భారీ అంచనాలతో విడుదలైన 'అజ్ఞాతవాసి' బాక్సాఫీస్ వద్ద తీవ్రంగా నిరాశపరిచింది. ఆ ఫ్లాప్ త్రివిక్రమ్‌ను ఆర్థికంగానూ ఇబ్బంది పెట్టింది. సినిమా నష్టాల కారణంగా తన రెమ్యునరేషన్ తిరిగిచ్చినట్లు స్వయంగా చెప్పారు. నిర్మాత, పవన్ కళ్యాణ్‌తో కలిసి డిస్ట్రిబ్యూటర్ల నష్టాలను భర్తీ చేసిన విషయాన్ని కూడా వెల్లడించారు. ఇటీవల మరోసారి ఆ రోజుల గురించి మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో కట్టుకుంటున్న ఇంటిని అమ్మేయాలని కూడా అనుకున్నట్లు గుర్తుచేసుకున్నారు. అంత పెద్ద సినిమా ఫెయిలైతే పరిస్థితి ఎంతవరకు వెళ్తుందో త్రివిక్రమ్‌కు అప్పుడే అనుభవమైంది. ఇప్పుడు 'ఆదర్శ కుటుంబం' విషయంలోనూ తమిళ చిత్రం 'బ్లాస్ట్' పేరు వినిపిస్తోంది. అర్జున్ నటించిన ఆ సినిమాలో మాదిరిగానే వెంకటేష్ సినిమాలోనూ ఒక కుటుంబానికి నేరస్తుల నుంచి ప్రమాదం ఎదురవుతుందని కొందరు పోలుస్తున్నారు. దీనిపై త్రివిక్రమ్, వెంకటేష్ ఇప్పటివరకు ప్రత్యేకంగా స్పందించలేదు. కానీ హీరోయిన్ శ్రీనిధి శెట్టి మాత్రం క్లారిటీ ఇచ్చింది. తాను 'బ్లాస్ట్' చూశానని, ఆ సినిమాకు 'ఆదర్శ కుటుంబం'తో ఎలాంటి సంబంధం లేదని చెప్పింది.

పైగా ఈసారి త్రివిక్రమ్ పనిచేస్తున్నది కూడా 'అజ్ఞాతవాసి' నిర్మించిన హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌లోనే. నిర్మాత రాధాకృష్ణకు అప్పటి నష్టాల గురించి తెలుసు. అలాంటి అనుభవం ఉన్న దర్శకుడు, నిర్మాత మళ్లీ అదే తరహా వివాదానికి అవకాశం ఇచ్చే కథను ఎందుకు ఎంచుకుంటారనే అభిప్రాయం కూడా వినిపిస్తోంది. అయితే 'ఆదర్శ కుటుంబం' ట్రైలర్‌లో చూపించిన కొన్ని సన్నివేశాల ఆధారంగానే ప్రస్తుతం ఈ పోలికలు వస్తున్నాయి. ఏదేమైనా త్రివిక్రమ్ మళ్ళీ అలాంటి పరిస్థితికి. ఏమాత్రం చాన్స్ ఇవ్వరు అనేది కొందరు చెబుతున్న మాట. ఇక సినిమా రిలీజ్ తర్వాత కథ ఎలా ఉంటుందో చూడాలి.



బ్రౌన్ రంగు దుస్తుల్లో మోనోక్రోమ్ ఫ్యాషన్‌కు కొత్త మెరుగులు దిద్దిన అయేషా ఖాన్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at H.NO: 38-4-216, MAHARANI STREET, MARRIPALEM, Visakhapatnam,Andhrapradesh-530018, Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, editorpenpower@gmail.com